అలనాటి అందగాడు

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూన్ 28, 2015

క్యూబికల్ లోకం

ప్రేమ కథా చిత్రమ్

హాలీవుడ్ స్టార్లంటే సెలెబ్రిటీ లోకానికి చక్రవర్తులే. ప్రపంచమంతా వారికి పిచ్చ ఫ్యాన్స్ ఉంటారు. ఇక యాక్షన్ హీరోలైతే క్రేజ్ ఆకాశానికి అంటేస్తుంది. లోకల్ హీరోలూ వాళ్లకు ఫ్యాన్సే. నటనను, స్టంట్లను పక్కన పెడితే లవ్ స్టోరీస్ మాత్రం అనుకరించాలని అనిపించేలా ఉంటాయి. వారి హాలీవుడ్ సినిమా కథల్లో ప్రిన్స్‌ల్లాంటి అబ్బాయిలు, ఓ మామూలు అమ్మాయితో లవ్‌లో పడిపోవడం, వాళ్లను పెళ్లి చేసుకునేందుకు నానా తంటాలు పడటం వావ్ అనిపిస్తాయి. ప్రెట్టీ ఉమెన్, ఎవర్ ఆఫ్టర్, మెయిడ్ ఇన్ మ్యాన్‌హట్టన్, ఎ సిండ్రెల్లా స్టోరీ, సబ్రీనా, టూ వీక్స్ నోటీస్, ప్రైడ్ అండ్ ప్రిజూడీస్ లాంటి ఎన్నో సినిమాలు ఈ కోవలోకి వచ్చేవే. ఓ మిలియనీర్, ఓ రాక్‌స్టార్ హఠాత్తుగా ఎదురైన ఓ మామూలు యువతితో లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌లో పడి కొట్టుకుపోతాడు. అల్లరిగా మొండికేస్తున్న అమ్మాయిని పరివిధాలుగా వేడుకుని పెళ్లి రింగ్ తొడుగుతాడు. ఆ సన్నివేశాల్ని రక్తి కట్టించేస్తారు హాలీవుడ్ స్టార్లు. నిజ జీవితంలో కూడా అలా సోల్‌మేట్‌లను చేసుకున్న హీరోలున్నారు. హాలీవుడ్ సూపర్ స్టార్ నికోలస్ కేజ్ ఇలాంటి ప్రేమికుడే. ఘోస్ట్‌రైడర్ మూవీతో చిన్నారులకూ ఇష్టమైన దెయ్యం హీరోగా మారిన కేజ్ ఓ కొరియన్ వెయిట్రెస్‌తో ప్రేమలో పడ్డాడు. కొరియన్ టౌన్‌లోని 'బుకింగ్ క్లబ్' వద్ద వెయిట్రెస్ ఏలిస్ కిమ్‌ను కేజ్ చూశాడు. తొలిచూపులోనే దాసోహమైపోయిన ఆయన ఏలిస్ కోసం ఆమె పని చేసే 'సూషీ బార్' అనే రెస్టారెంట్‌కు తరచూ వెళ్లేవాడు. లేటు వంటకాన్ని ఆర్డర్ చేసి ఆమెతో ముచ్చట్లు చెప్పేవాడు. ఓ రోజు ఆమె క్యాషియర్ డ్యూటీ చేస్తుండగా తన ప్రేమను ఎక్స్‌ప్రెస్ చేస్తూ ఓ డైమండ్ రింగ్‌ను ఇచ్చాడు. 2004లో వారి పెళ్లి అయింది. మరుసటి ఏడాదే వారి ప్రేమకు గుర్తుగా ఓ అబ్బాయి పుట్టాడు. గతేడాది విడుదలై మనదేశంలోను రికార్డులు కొల్లగొట్టిన 'ఇంటర్‌స్టెల్లార్', అంతకు ముందు వచ్చిన 'ఎలీసియమ్' వంటి సైన్స్ ఫిక్షన్ సినిమాలు, 'బోర్న్' యాక్షన్ మూవీ సిరీస్ యాక్షన్ హీరో మ్యాట్ డామెన్‌ది కూడా ఇదే ప్రేమ కథే. 2003లో 'కామెడీ స్టక్ ఆన్ యూ' సినిమాకు పనిచేస్తున్న మ్యాట్‌ను స్నేహితులు సెట్ నుంచి పబ్‌కు లాక్కెళ్లారు. అక్కడ బార్‌టెండర్‌గా పనిచేస్తున్న లూసియానా బరోస్సోను చూసి ఏం ఆర్డర్ చేయాలో అతడికి మాట పెగల్లేదట. తన తడబాటుకు కారణం ఆమెతో ప్రేమలో పడిపోవడమే అని తెలుసుకుని రెండేళ్లు పోరాడి మరీ ఆమె హృదయాన్ని గెలుచుకున్నాడు. 2005లో వీరి వివాహమైంది. నలుగురు ఆడపిల్లలకు జన్మనిచ్చింది ఆ జంట. 'బ్యాట్‌మెన్ అండ్ రాబిన్' సినిమాలో రాబిన్‌లా మెప్పించిన క్రిష్ ఓ డానెల్ తన చిన్ననాటి మిత్రురాలు కెరొలిన్ ఫెంట్రెస్‌ను 1997లో వివాహమాడాడు. ఆమె అప్పుడు ఓ ఎలిమెంటరీ స్కూల్లో టీచర్. వారికిపుడు ఐదుగురు పిల్లలు. ఎడ్డీ మర్ఫీని కూడా వెయిట్రెసైన లారా లరూయ్ అనే అమ్మడి కొంగున కట్టుకుంది. 2007లో డేవిడ్ స్కిమ్మర్‌కు జో బుక్‌మన్ అనే అందెగత్తె లండన్‌లోని కుక్కూ క్లబ్‌లో భోజనం వడ్డించింది. ఆ వడ్డనలో ప్రేమ పుట్టి మూడేళ్లు ఆమె చుట్టూ ప్రదక్షిణలు చేసి పెళ్లి చేసుకున్నాడు. 2011 కల్లా పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ●

కెరొలిన్ ఫెంట్రెస్, క్రిష్ ఓ డానెల్

జో బుక్‌మన్, డేవిడ్ స్కిమ్మర్

లూసియానోబరోస్సో,
మ్యాట్ డ్యామన్

ఏలిస్ కిమ్, నికోలస్ కేజ్

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

బంగారం... సింగారం... వ్యాపారం....

లోహాల్లో రారాజు బంగారం. దాని మెరుపుకి మోకరిల్లే వాళ్లు, దాని రంగుకి వొంగి సలాం చేసేవాళ్లూ కోకొల్లలు. పుత్తడి అంటే మనకు అంత ప్రేమ, ఇష్టం, కోరిక. ఆ నాలుగక్షరాల లోహం కోసం చరిత్రలో ఎన్ని యుద్ధాలు జరిగాయో... ఎన్ని ప్రాణాలు గాలిలో కలిశాయో.. ఎంత రక్తం ఏరులై పారిందో...! ఎంత మంది పరుసవేదులుగా తయారయ్యారో లెక్కించలేం. పుత్తడి నిధుల కోసం చీమలు దూరని చిట్టడవుల్లో...కాకులు దూరని కారడవుల్లో అన్వేషిస్తూ ప్రాణాలు కోల్పోయినవారెందరో!

అప్పటికీ ఇప్పటికీ దాని మీద వున్న క్రేజు...మోజు అలాంటిది. మార్కెట్లో ధర ఎంత పలుకుతున్నా కొనాల్సిందే.. ధరించాల్సిందే. వివాహం, నామకరణోత్సవం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన సమయంలోనూ బంగారం వుండాల్సిందే. ఘనంగా వేడుక జరుపుకోవాల్సిందే. అక్షయ తృతీయ, ధన్‌తెరాస్ వంటి ప్రత్యేక సందర్భాలలో బంగారానికి బహు గిరాకీ. జననంలోనే కాదు మరణంలోనూ పుత్తడికి ప్రాధాన్యత వుంది. ఎవరైనా చనిపోయినప్పుడు తమలపాకుల్లో చిన్నం బంగారం చుట్టి మరీ నోట్లో పెట్టి దహన సంస్కారాలు చేస్తుంటారు కొందరు.

రోజువారీ మాటల్లోనూ బంగారం ప్రస్తావన వస్తుంటుంది. పెళ్లిళ్లు కుదుర్చుకునేప్పుడు ...పిల్ల అందంగా వుంటే 'పుత్తడి బొమ్మలాగుంది' అంటారు. మారాం చేసే పిల్లలను తల్లులు 'మా బాబు బంగారు కొండ' అంటూ దారికి తెచ్చుకోవాలని చూస్తారు. అంతేనా! 'ఒరే బంగారం...అరే బంగారం... నా బంగారు తల్లి...నా బంగారు తండ్రి...' అని ఎన్ని రకాలుగా పిల్చుకుంటారో. ఏదైనా మంచి ఉద్యోగం వస్తే... బంగారం లాంటి అవకాశం వదులుకోవద్దని చెప్తుంటారు. ఈ పిలుపులు, పోలికలన్నిట్లోనూ బంగారం పట్ల మనకు గల ఇష్టం, ప్రేమ, మోజు వ్యక్తమవుతుంటాయి.

మదుపుకి, పొదుపుకి పుత్తడే ప్రధాన వనరు. బంగారం వుంటే కష్టకాలంలో ఆదుకుంటుంది. దీనికోసమైనా అవసాన దశలో ఆదరిస్తారని ఆశ. ప్రభుత్వాలు సైతం బంగారం ఇచ్చి బాండ్లు పుచ్చుకోమంటున్నాయి. రోజురోజుకి పుత్తడి ధర ఆకాశాన్నంటుతుండడంతో అబ్బాయి తరపువారు వరకట్నం పట్ల పెద్దగా ఆసక్తి చూపడంలా. అమ్మాయి మరీ బోసిగా లేకుండా ఓ నలభై యాభై తులాల బంగారం పెట్టమంటున్నారు సింపుల్‌గా. కాకపోతే ఆ మాట విన్న పిల్ల తల్లిదండ్రులకే గుండెలు గుభేలుమంటున్నాయి. బంగారం మీద ఇంత భ్రమ వుంది కనకే మన దేశంలో ఏడాదికి సుమారు అయిదు వందల టన్నులకు పైగా బంగారం వినియోగం అవుతోందని ఓ అంచనా. ఈ లెక్కన దేశంలో ఎంత బంగారం పోగుబడిందో పోగేసిన వారికే ఎరుక! ఆభరణాలుగా కాక దైనందిన జీవితంలో ఎందుకూ పనికి రాని ఈ లోహం కోసం ఎందుకో ఇంత అది! అంత ఇది! ■

◆ మనలో మాట



టపా

మారిన గూండా

నిత్యం అగ్ని పర్వతాల ప్రకంపనలతో లావాను, ధూళిని పైకి ఉబికిస్తూ ప్రాణాంతకంగా కనిపించే 'రాబాల్' గ్రామం లో 150 మంది జనం పిల్లా పాపలతో జీవించడం నిర్ఘాంతపర్చింది. 50 ఏళ్లలో 180 దేశాలు ఒంటరిగా పర్యటించి ఇంకా మిగిలిన ప్రపంచాన్ని చుట్టి రావాలను కుంటున్న 70 ఏళ్ల మెహర్ సాహసాన్ని అభినందించాలి. చిన్న వయస్సు నుంచే దొంగతనం, దాదాగిరికి అలవాటు పడ్డ అఖిలేష్ ఫుట్‌బాల్ క్రీడల్లో రాటుదేలి అంతర్జాతీయంగా ఖ్యాతి గడించడం గొప్ప విషయం.

టి. సత్యనారాయణ మూర్తి, మల్లాపురం, విశాఖ.

సూటైన మాట

నేడు అన్నింటిలోనూ ఎదురు దాడి చూస్తున్నాం. తప్పు చేసిన వాడు తప్పించుకోవడానికి ఎదురు దాడికి దిగుతున్నాడు. కాకపోతే ఒకరు ముందు మరొకరు వెనుక. అందరు పాలకులు ఒకే తానులో ముక్కలే. ప్రజాప్రతినిధులు ఓట్లు కొనుక్కుంటున్నట్లు ప్రభుత్వ పాలకులు ప్రజా ప్రతినిధులను కొనుక్కుంటున్నారు. అధికార పీఠం సుస్థిర పరచుకోవడానికి ముఖ్యమంత్రి మామూలుగా వ్యాపారం చేస్తున్నారు. ముడి సరుకులు ప్రజాప్రతినిధులే. డిమాండ్‌ను బట్టి ధర పలుకుతుంది.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

అగ్ని పర్వతాన్ని హత్తుకుని...

రాబాల్ పట్టణం నిత్యం నౌకల రాకపోకలతో కళకళలాడే ద్వీప ప్రాంతం. అగ్నిపర్వతాలు విస్ఫోటనం చెందడంతో కేవలం 150 మంది మాత్రమే నివసించే చిన్న గ్రామం అయింది. బండ్లు ఓడలు కావడం, ఓడలు బండ్లు కావటం అంటే ఇదేనేమో బహుశా! తమ పూర్వీకులు గుర్తుగా నిలిచిన ఆ ప్రాంతాన్ని విడవలేని వారు ఆ అగ్ని పర్వతపు నీడలోనే జీవించడం నిజంగా ఆశ్చర్యకరం.

రాము, కడప

ఆనంద వనం

ఇంటికో చెట్టు, గ్రామానికో వనం అన్న చందంగా కోజికోడ్ జిల్లాకు చెందిన ఖోయా ఐదు సంవత్సరాలుగా దుబాయిలో జీవించినప్పటికీ తన సొంత గ్రామం మీద మమకారం, ఆప్యాయత చాటుకున్నాడు. ఇతన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే. పర్యాటక స్థలంలో అతి ముఖ్యమైన ప్రాంతంగా చోటు సంపాదించుకుంది. అదే విధంగా నౌకాశ్రయంలోను అతి పెద్దది. అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు విశేషంగా ఆకట్టుకుంటాయి.

టి. జగదీష్, ఈ మెయిల్.

టెన్నిస్ సిస్టర్స్

టెన్నిస్ ఆట అనగానే గుర్తుకు వచ్చేది విలియం సిస్టర్స్. అటు ఆటలోను, ఇటు సామాజిక సేవలోను చెరగని ముద్ర వేసుకున్నారు ఈ నల్ల కలువలు. 20 గ్రాండ్ స్లామ్‌లను సొంతం చేసుకున్న విలియంను అభినందించాల్సిందే. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని చెప్పడానికి వీరిని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

చంద్ర, కడప (మెయిల్)

ఒంటరి యాత్ర

అనంత విశ్వంలో మనిషి ఒంటరి జీవి. ఎప్పటికైనా తను ఈ సమాజంలో ఒంటరిగా నిలిచిపోయేవాడే. మెహర్ హోరోయ్స్ తను కూడా ఇదే సూత్రాన్ని ఆచరించినట్టుంది.

రాజు, విశాఖ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజామాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

క్యూబికల్ లోకం

కవర్ స్టోరీ ---- 14

ఈ గోళం రూబిక్స్ క్యూబ్‌లో బందీ అయ్యింది. క్యూబ్‌ను తిప్పుతున్న భ్రమలో దానిలోనే పరిభ్రమిస్తోంది. అది చేతిలో పడటం ఆలస్యం మన వేళ్లు తెలీకుండానే క్యూబీస్‌తో డ్యాన్స్ చేస్తుంటాయి. తారుమారైన రంగుల్ని ఓ చోట చేర్చే ప్రయత్నంలో పడి, దాని చుట్టూనే మన ఆలోచనలు చక్కర్లు కొడుతుంటాయి. దాని స్పిన్ మాయాజాలం, రంగుల కలడోస్కోపిలో మునిగితే ఇక కాలం అంతుబట్టదు. ఏ మాత్రం తడబడినా దాన్ని పరిష్కరించే కిటుకు వంటబట్టదు. అరచేతంత ఉండే ఆ చిట్టి క్యూబే ఓ పెద్ద రాజ్యమైంది. రూబిక్స్ క్యూబ్ మీ దగ్గరుందా, అయితే నలభై కోట్ల మంది పైగా క్యూబర్లున్న ఆ క్యూబికల్ లోకంలో మీరూ ఓ క్యూబుడే అన్న మాట.

స్ఫూర్తి 3
జల వైద్యుడు

నవ్వుల్ పువ్వుల్ 4

బంధం 5
జో జోయిల కథ

సినిమా కబుర్లు 6
అలనాటి అందగాడు

వింత లోకం 8
మూడు మార్చేస్తుంది

ప్రకృతి 9
ఆరు నెలలు వానే

ప్రత్యేకం 10
రాష్ట్రపతికి మన ఆతిథ్యం

కథ 18
మేడిపండు

బాలనేస్తాలు 22
చిట్టి నక్క

కొత్త పుస్తకాలు 24
జర్నలిస్టు శైలికి మార్గదర్శి

రుచి
చింత చిగురు మాంసం
.... 13

ఒక్క ఫైవ్ కూడా అప్పలేదు - 12

నది ప్రాణాధారం.
ఆ నదికే ప్రాణం పోస్తే?
ఆవిరైపోయిన జల కళకు
జీవాన్నిస్తే. ఒక్కడే ఏకంగా
ఐదు నదులకు నీటిదానం
చేస్తే ఏమనాలి?
కనుమరుగైపోతోన్న
జీవజలాన్ని పునరుద్ధరిస్తున్న
జల మాత ముద్దుల బిడ్డ
రాజేంద్ర సింగ్‌ను 'వాటర్
మేన్ ఆఫ్ ఇండియా' అని
పిలుస్తున్నారు. జబ్బు పడిన
ఎడారి జలాలకు వైద్యం
చేస్తున్నాడీ ఆయుర్వేద
వైద్యుడు.

జల వైద్యుడు

రాజస్థాన్‌లో చుక్క నీరు కూడా అమృతంతో సమానమే. ఎడారంతా జల్లెడ పడితే ఎక్కడో చిన్న చిన్న జలాశయాలు కనిపిస్తాయి. మైళ్లకు మైళ్లు కాలినడకన నీటి బిందెల్ని మోయడమే అన్నింటి కన్నా ముఖ్యమైన విషయం అక్కడ. అలాంటి ప్రాంతంలో అమృత ధారలుగా పేరొందిన నదులు కాస్త అంతరించిపోతుంటే రాజేందర్ సింగ్ ప్రాణమే పోతున్నట్టు వ్యాకులచెందారు. ఆ నదీమ తల్లులను కాపాడుకోవాలని పరితపించారు. రాజేందర్ సింగ్ ఓ ఆయుర్వేద వైద్యుడు. కానీ, వ్యవసాయం పైనే ఆసక్తంతా. 1985లో వైద్య పట్టా చేతికందగానే ఆల్వార్ జిల్లాకు తిరిగొచ్చేసి తన ప్రాంతంలో వైద్యంతో పాటు వ్యవసాయం చేద్దామని ఉత్సాహంగా వచ్చారు. అంతకు ముందు తనకు ఇష్టమైన నది పాయ అదృశ్యమై, ఆ ప్రాంతం సగం ఖాళీ అయి కనిపించే సరికి విస్తుపోయారు. సరైన సంరక్షణ చర్యలు లేక నదీ పాయలు ఆవిరైపోయాయని అర్థం చేసుకున్న ఆయన తాను ముందు వైద్యం చేయాల్సింది నదీ ప్రాంతానికి అని గ్రహించారు. తన ఒక్కడి వల్ల అది అవుతుందా అనేది ఆలోచించకుండా వెంటనే రంగంలోకి దిగారు.

ప్రాచీన భారతీయ విజ్ఞానానికి చెందిన భూ, జల, పర్యావరణ సూత్రాలకు అనుగుణంగా 'జోహాద్' శైలిలో వాన నీటి జలాశయాల్ని తవ్వడం ప్రారంభించాడు. నదుల్లోకి చేరే వాగులున్న చోట వాటి నిర్మాణం చేపట్టాడు. అందుబాటులో ఉన్న మట్టి, రాళ్లు, కాంక్రీట్ వంటి వస్తువులతోనే వాటిని పూర్తి చేశాడు. వీటి వల్ల భూగర్భ జలాల మట్టంతోపాటు జలాశయాల మట్టం పెరుగుతుందనేది ఆయన అంచనా. వాగుల వేగాన్ని తగ్గించేందుకు చెక్ డ్యామ్‌లను ఏర్పాటు చేసి నీరు ఇంకేలా నీటి పారుదల వ్యవస్థను రూపొందించారు. రెండేళ్ల పాటు అవిశ్రాంతంగా కృషి చేసినా అనుకున్న ఫలితం అందలేదు. స్థానికుల ఆయన ప్రయత్నాన్ని పరిహసించినా వెనుకడుగు వేయలేదు. మరింత శ్రమించి జోహద్‌ల సంఖ్య పెంచుకుంటూ పోయాడు. ఆయన ప్రయత్నం వెనుక ఉన్న సదాశయం గ్రామస్తులను కదిలించి వారూ చేయి కలిపారు. జోహద్‌ల సంఖ్య పెరిగే కొద్దీ ఫలితం మెరుగవుతూ వచ్చింది. ఎప్పుడో 1940లోనే అంతరించిపోయిందనుకున్న ఆర్వారి నది తన ప్రస్థానాన్ని మళ్లీ ప్రారంభించింది. మరో నాలుగు నదులు తిరిగి ప్రాణం పోసుకున్నాయి. 1000 ఎకరాల ప్రాంతంలో మళ్లీ పచ్చదనం చిగురించింది. జలాశయాలు కళకళలాడాయి. మట్టికి నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగింది. వాన నీటి వృథా తగ్గిపోయింది. తాగునీటి బావులు, జలాశయాలు జీవం పోసుకున్నాయి. 20 అడుగుల మేర భూగర్భ జల నీటి మట్టం పెరిగింది. అటవీ ప్రాంతం 33 శాతానికి పైగా విస్తరించింది. వలస పోయిన వారు తిరిగి గ్రామాలకు చేరుకున్నారు. వ్యవసాయం సాధ్యమైంది.





తన ప్రయత్నం వల్ల ఏకంగా నదులే జీవాన్ని సంతరించుకుంటాయని ఊహించని రాజేంద్ర సింగ్‌కు ఇది పెద్ద బహుమతి అయ్యింది. ఇంకా తన పథకాలు విస్తరించుకుంటూ ఎన్నో గ్రామాలకు తీరుతెన్నుల్ని మార్చారు. అలా ఇప్పటివరకు 11 రాష్ట్రాల్లోని 850 గ్రామాల్లో 4500 జోహద్‌లను నిర్మించారు. నదీ సభలను ఏర్పాటుచేసి గ్రామస్తులు స్వతహాగా నీటిని సంరక్షించుకునేలా ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలోని జల సంరక్షణకు అడ్డు తగులుతున్న 470 గనుల్ని మూసివేయాల్సిందిగా ప్రభుత్వాన్ని ఒప్పించాడు. దీనిపై అక్కసు పెంచుకున్న గని యజమానులు ఆయనపై దాడులు చేయించారు. ప్రజల అండతో ఆయన తన ప్రయత్నాన్ని విరమించుకోలేదు. రాజేంద్ర సింగ్ రాజస్థాన్‌లో ఓ హీరో అని అనడం కన్నా వారికి, వారి ప్రాణ సమమైన జల వ్యవస్థకు ఆయువునిచ్చిన జల వైద్యుడు అని చెప్పుకోవచ్చు.

నవ్వుల్ – పువ్వుల్

ఏ పక్క



"మీ ఆవిడా, మా అమ్మా సూర్యాకాంతం ఛాయాదేవిల్లా రోజు పోట్లాడుకుంటున్నప్పుడు నువ్వే పక్క నిలుచుంటావు? అమర్‌ను అడిగాడు జగదీష్.

గోడపక్క చెప్పాడు అమర్.

తల నొప్పి



నిన్న రాత్రి భయంకరమైన తల నొప్పి తో బాధ పడ్డాను చెప్పాను నవీన్.

అవునవును 'ఆ తలనొప్పి'.. సినిమా హాల్లో నీ పక్క సీటులో కూర్చుని ఉంది కదా నేను కూడా చూశాను అన్నాడు రాము.

ఆలస్యం

బడికి ఇవాళ ఆలస్యమయ్యిందేం రా? అడిగింది టీచర్

"బడికి ఆలస్యంగా రానని..వందసార్లు ఇంపోజిషన్ రాయమన్నారుగా. అది రాయటం వల్లే ఆలస్యం అయ్యింది మేడమ్" చెప్పాడు రాజు.

తగిన చోటు

మోకాళ్ళ నొప్పులకు ఒక దివ్యౌషధం కనిపెట్టారు. షాపు ఎక్కడ పెడితే సరుకు బాగా అమ్ముడౌతుంది సలహా అడిగాడు శంకర్.

ఆర్.టి.సి బస్టాండ్‌ల దగ్గర పెట్టు వ్యాపారం బ్రహ్మాండగా సాగుతుంది. చెప్పాడు శేషు.

ఆపిల్ పండు

రాజేష్: న్యూటన్ ఆపిల్ పండు కింద పడగానే కిందకు ఎందుకు పడిందని ఆలోచించాడు. మరి నువ్వైతే?.

గిరీష్: పడగానే తినేసి రెండోది ఎప్పుడు పడుతుందా అని ఆలోచిస్తాను.

అమ్మాయే

ఆది: చూడండి ఆ వ్యక్తి ఎలా బట్టలేసుకున్నాడో ఆ జీన్సు ప్యాంటు... పూల చొక్కా ...ఆ జుట్టు ...అబ్బాయంటారా? అమ్మాయంటారా?

అవతలి వారు: అమ్మాయే. తను నా కూతురు.

ఆది: ఓ క్షమించండి సర్ మీరు ఆ అమ్మాయికి తండ్రనుకోలేదు.

అవతలి వారు: తండ్రిని కాదు తన తల్లిని.

టాబ్లెట్

శంభులింగం: అదేంటి జంభూ! తలకిందులుగా ఎందుకున్నావు?

జంబులింగం: తలనొప్పిగా ఉందిరా

శంభులింగం: మరి టాబ్లెట్ వేసుకోవచ్చుగా?

జంబులింగం: వేసుకున్నారా, కానీ అది గొంతులో నుండి కడుపులోకి వెళ్ళింది అందుకే అది తలలోకి వెళ్ళాలని ఇలా తలకిందులుగా వేళ్ళాడుతున్నా.

ఫర్నిచర్ వ్యాపారం

పంతులమ్మ: మీ డాడీ ఏం చేస్తుంటాడోయ్

చింటూ: ఫర్నిచర్ అమ్మే పని టీచర్.

పంతులమ్మ: వ్యాపారం బాగా సాగుతోందా మరి.

చింటూ: మాబాగా సాగుతోంది టీచర్. ప్రస్తుతం ఇంట్లో మంచం మాత్రమే మిగిలింది. (తాపీగా చెప్పాడు చింటూ)



జో జోయీల కథ

ఆస్ట్రేలియాలో కోలా పిల్ల జోయీ, మలేషియాలో ఓ పిగ్మీ ఏనుగు పిల్ల జో తమ తల్లుల క్షేమం కోసం పరితపించిపోయాయి. కోలాయేమో రోడ్డు ప్రమాదానికి, బోర్నియో ఏనుగేమో విష ప్రభావానికి గురయ్యాయి. కదలకుండా పడి ఉన్న తల్లుల దేహాలను ఆరునెలల వయసున్న పిల్లలు అంటి పెట్టుకుని ఉండిపోయాయి. వాటి తల్లుల్ని లేపేందుకు అవి పడిన తపన చూసి చలించిపోయారు జంతు సంరక్షకులు. వాటి ప్రేమ ఎంత గాఢమైందో ప్రపంచానికి తెలిసేలా జంతువు ప్రేమికులు ఆ దృశ్యాల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టారు.

ఆస్ట్రేలియాలోని వార్రెగో జాతీయ రహదారిలో ప్రమాదానికి గురైంది తల్లి కోలా. కోలాలు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొనడంతో దానికి తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అప్పటి నుంచి పిల్ల కోలా తల్లిని లేపేందుకు అన్ని విధాల ప్రయత్నించింది. ఎంత కదిపినా, అరిచినా లాభం లేక తల్లిని కరుచుకుని ఉండిపోయింది. విషయం తెలిసిన ఆస్ట్రేలియా జూ వైల్డ్‌లైఫ్ ఆస్పత్రి సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్లి వాటిని ఆస్పత్రికి తరలించారు. ప్రయాణంలో చిన్న కోలాను తల్లి నుంచి పక్కకు తీసి పరిశీలించేందుకు ప్రయత్నిస్తే అది తల్లిని వదల్లేదు. శస్త్రచికిత్స చేసే సమయంలో మరోమారు దాన్ని తల్లి నుంచి విడదీసే ప్రయత్నం చేయగా ఇంకాస్త గట్టిగా తల్లిని అంటిపెట్టుకుంది. దానిని అలాగే ఉంచి శస్త్రచికిత్స పూర్తిచేశారు వైద్యులు. తల్లిలో కాస్త చలనం వచ్చాక గానీ, చిన్ని కోలా స్థిమితపడలేదు. తల్లి బాగానే ఉందని గ్రహించి అప్పుడు వైద్యుల చేతుల్లోకి వెళ్లింది. వాళ్లిచ్చిన పాలను తాగి మళ్లీ తల్లి దగ్గరకు చేరింది. సాధారణంగా కోలా పిల్లలకు ఆరు నెలలు వయస్సు వచ్చే వరకు తల్లే చాలా జాగ్రత్తగా సంరక్షిస్తుంది. తన పొత్తిలిలో ఉన్న సంచిలాంటి అమరికలో పిల్లను దాచుకుంటుంది. ఏడాదయ్యాక గానీ వాటిని వదిలేయదు. అంత ఆదుర్దా పడిపోతున్న చిన్ని కోలా ప్రేమ వల్లో ఏమో తెలీదు కానీ, తల్లి కోలుకోవడం మొదలైందట. తల్లికి లిజ్జీ అని, పిల్ల జోయీకి ఫాంటమ్ అని పేరు పెట్టారు.

ఈ అదృష్టం గునుంగ్ రారా అడవికి చెందిన బోర్నియో పిగ్మీ ఏనుగు పిల్లకు లేదు. విష ప్రభావంతో చనిపోయిన 14 ఏనుగుల గుంపులో దాని తల్లి మరణించింది. కాస్త ఆలస్యంగా విషయం తెలిసీ అక్కడకు వెళ్లిన మలేషియాలోని కోటా కినబాలు వద్దనున్న లోక్ కావి జూ సిబ్బంది ఘటన ప్రదేశానికి చేరుకున్నారు. విగతజీవిలా పడివున్న తల్లి ఏనుగును కదిలించేందుకు చిన్ని ఏనుగు పడుతున్న కష్టాన్ని చూసి వారి గుండె ద్రవించింది. చాలా కష్టపడి దాన్ని అక్కడ నుంచి దూరంగా తీసుకురాగలిగారు. తల్లి మృతి విషయం అర్థమైందేమో చిన్ని ఏనుగు ముభావంగా మారి ఆహారాన్ని తీసుకునేందుకు ఇష్టపడలేదు. సిబ్బందిలోని అగస్టిన్ డేవిడ్ చొరవ తీసుకుని పిల్ల ఏనుగుకు దగ్గరయ్యే ప్రయత్నం చేశాడు. అతడి ప్రయత్నాలు ఫలించి క్రమంగా అది కోలుకుంది. తొలుత తల్లి పాల ద్వారా విష ప్రభావం పిల్ల ఏనుగుకు పాకి అది బతుకుతుందో లేదోనని జూ సిబ్బంది భయపడ్డారు. 24 గంటలూ కంటి రెప్పగా చూసుకుని డేవిడ్ దాని ప్రాణాలు నిలిచేలా చేశాడు. లిటిల్ జోగా పేరుపెట్టిన అది అప్పటి నుంచి డేవిడ్‌ను తన తల్లి అనుకుని అతడిని వదలడం లేదు. డేవిడ్ కూడా మిగతా పనులన్నీ మానుకుని దానికి పాలు పట్టడం, వ్యాహ్యాళికి తిప్పడం, స్నానం చేయించడం, ఆటలు నేర్పడంలో పడిపోయాడు. ఆయన దృష్టి తన నుంచి కొంచెం మరలినా లిటిల్ జోకి కోపం వస్తుందట. తన తొండంతో డేవిడ్ కాళ్లను చరిచి దాని వైపు తిప్పుకుంటోందట. ఇంతలా బంధాన్ని పెనవేసుకుపోవడంతో డేవిడ్‌ను అందరూ లిటిల్ జోకి అమ్మ అని పిలుస్తూ ఆటపట్టిస్తున్నారట. ఆ విషయాన్ని గర్వంగా తీసుకుని అది చేసే అల్లరిని అందరికీ తెగ సంతోషంగా చెబుతున్నాడు డేవిడ్. ఇది మారాం బాగా చేస్తుందని, స్నానం అస్సలు నచ్చదని, రుచిగా ఉంటేనే పాలు తాగుతుందని నవ్వుతూ చెబుతున్నాడు. ఆటల్లో తీరిక లేకుండా ఉన్న లిటిల్ జోని త్వరలోనే ఓ ఏనుగు కుటుంబంలో చేర్చేందుకు ఎదురుచూస్తున్నారు జూ సిబ్బంది. అయితే, డేవిడ్ ఆందోళన ఇంకా తగ్గలేదు. నెలల వయసులోనే తల్లిని కోల్పోయిన పిల్ల ఏనుగులు బయటి ఆహారం పడక తీవ్రమైన కడుపు నొప్పికి గురై మరణిస్తాయట. ఆ పరిస్థితి లిటిల్ జోకి రాకుండా ఆయన గట్టి ప్రయత్నమే చేస్తున్నాడు. కునుకు లేకుండా దాని సంరక్షణలోనే గడుపుతున్నాడు. ఇలాంటి లిటిల్ జోలు, జోయీల కథలు కోకొల్లలు. మనిషి నిర్లక్ష్యానికి బలైపోతున్న ఈ వన్యప్రాణి కుటుంబాల్ని కాపాడుకునేందుకు సామాజిక మాధ్యమాలను జంతు ప్రేమికులు వేదికగా చేసుకుంటున్నారు.

-సిరి



అగస్టిన్ డేవిడ్, జో

అలనాటి అందగాడు

హరనాథ్! ఎన్టీఆర్, ఎఎన్నార్ తర్వాత పురాణ పురుషుల పాత్రలు వేసి మెప్పించిన నటుడు. నందమూరి, అక్కినేని అగ్రతారలుగా వెలిగిపోతున్న కాలంలోనే ఒక దశాబ్దం పాటు కుటుంబ కథానాయకుడిగా మహిళల మనసు దోచుకున్న హీరో. మరో సూపర్‌స్టార్‌గా ఎదుగుతాడని అభిమానులు అనుకున్న స్టార్. నాటకాల నుంచి బైటపడి పాత్రోచితంగా సహజంగా నటించి మెప్పించిన కథానాయకుడు. అందనంత ఎత్తుకు వెళ్లాల్సినా ... అందలాలను పూర్తిగా అందుకోలేకపోయిన అందగాడు.

ఆజానుబాహుడూ అరవింద దళయతాక్షుడూ.. తెలుగు వెండితెర మీద నిండైన నిలువెత్తు విగ్రహంలా.. అపర రామ చంద్రమూర్తిలా ఆవిష్కరించిన నటుడు బూదరాజు అప్పల నరసింహరాజు. గోదావరి జలం స్పర్శతో ఎదిగిన హరనాథ్ రాజ్ చిన్నతనం నుండి ఆటాపాటలతోనే ఎదిగాడు. స్వతహాగా రాచరికపు అలవాట్లు... అతి గారాబంగా పెరిగిన హరనాథ్ తొలి రోజుల్లో పిఠాపురం ఎంత దూరం? కళ్ళు మూసుకుంటే నాలుగడుగులు, బైక్‌మీద పదినిమిషాల ప్రయాణం అందుకే కాకినాడ పి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో చదువుతున్న రోజుల్లో పద్దెనిమిది గంటల సమయం కాకినాడలోని ఫ్రెండ్స్‌తోనే గడిపాడు. పి.ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో చదువుతుండగా ఆటపాటలతో పాటు అల్లరిలోనూ ముందుండేవాడు. ప్రెసిడెంట్ హోదాలో చక్రం తిప్పేవాడు. హరనాథ్ బ్యాచ్‌కి ఎవరూ ఎదురొచ్చేవాళ్ళు లేరు. అయినా అనవసరమైన గొడవల జోలికి వెళ్ళేవాడు కాడు. కాలేజీకి ఎగనామం పెట్టి ఎప్పుడూ నాటకాలు. .సూర్యకళా మందిరంలో ప్రదర్శనలూ రాష్ట్ర వ్యాప్తంగా నాటక పోటీలూ ఇవే హరనాథ్ రాజు నిత్య కృత్యాలు.

కాకినాడలో సినిమా రోడ్‌లో వున్న యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్‌కి గణనీయమైన చరిత్ర వుంది. ఈ ప్రాంగణంలో మెజిస్టిక్ థియేటరుంది. క్లబ్ మూలధనంతో నిర్మించుకున్న థియేటర్ ఇది. అంత గొప్ప సంస్థ. ఈ సంస్థ నుంచే ఘనపాటీల్లాంటి నటీనటులు పరిచయం అయ్యారు. రేలంగి, అంజలీదేవి, యస్.వి. రంగారావు, బి.వి సుబ్బారావు. వీరంతా యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ప్రొడక్ట్స్. కొత్త నాటకాలు రాయించుకోవడం దేశమంతా ప్రదర్శించడం వీరి వ్యాపకం. ఇలా ఒకసారి హరనాథ్ రాజు తన నటులతో చెన్నై ఆంధ్రా క్లబ్‌లో ప్రదర్శన ఇస్తుండగా దర్శక నిర్మాత జి.రామినీడు చూడటం జరిగింది.

జి. రామినీడు గురించి నాలుగు మాటలు చెప్పేతీరాలి. రామినీడు ఆంధ్రాక్లబ్ వ్యవస్థాపకుడు ఆంధ్రదేశం నుంచి ఎటువంటి ఔత్సాహిక కళాకారులు వచ్చినా వారిలో ప్రతిభని గుర్తించి ప్రోత్సహించడంలో ఆయన ముందుండేవారు. అలా 'ఋష్యశృంగ' చిత్రం కోసం ఎంపిక చేసిన నటుడే హరనాథ్ రాజు. అయితే మొట్ట మొదట నిర్మాణమై విడుదలైన చిత్రం 'మా ఇంటి మహాలక్ష్మి' ఇండస్ట్రీకి కొత్త హీరో వచ్చాడు. పొడుగరి. అందగాడు అన్న వార్త తెలుగు ఇండస్ట్రీ అంతా గుప్పుమంది.

ఈ సందర్భంగా హరనాథ్ జీవితంలో ఎదురైన ఒక చిత్రమైన అనుభవాన్ని ప్రస్తావించాలి. అవి యన్.ఏ.టి బ్యానర్‌లో "సీతారామ కళ్యాణం" చిత్రం నిర్మిస్తున్న రోజుల్లో యన్.టి.రామారావే శ్రీరాముడి పాత్ర పోషిస్తాడనుకున్నారంతా. కాని అలా కాకుండా యన్.టి.ఆర్ రావణుడిగా నటిస్తుండగా సమవుజ్జీగా అంతకంటే గొప్పగా కనిపించగల, నటించగల నటుడి కోసం అన్వేషిస్తుండగా తారకరాముడి దృష్టిలో అభినవ రాముడు హరనాథ్ కంటపడ్డాడు. హరనాథ్ తన చిత్రానికి అచ్చు గుద్దినట్లు సరిపోతాడని నిర్ణయానికొచ్చాడు. ఆ మాటే చెప్పాడు. తొలుత యన్.టి.ఆర్ కండిషన్స్‌కి భయపడిపోయాడు. ఆ కండిషన్స్ ఏమిటంటే పొగ త్రాగకూడదు. మత్స్యమాంసాదులు ముట్టకూడదు. మద్యం జోలికి పోకూడదు. చిల్లర వేషాలు వెయ్యకూడదు. ఇవి హరనాథ్‌కి అసాధ్యమైన విషయాలు. ఇంచుమించు ప్రాణాంతకమైన నిబంధనలు. కొంతకాలం డైలమాలోనే వుండిపోయాడు. చివరికి ఒక గొప్ప చిత్రం మిస్సవ్వకూడదని యన్.టి.ఆర్ షరతులకు ఒప్పుకొని సీతారామ కళ్యాణం చిత్రంలో శ్రీరాముడి పాత్రకు ఒప్పుకున్నాడు. గెటప్ చూసి అందరూ ఆశ్చర్యపోయారు. ఆనందపడిపోయారు. అచ్చు శ్రీరాముడిని చూసినట్లుగానే వుందని ఆశీర్వదించారు. అయినా హరనాథ్ పక్కన సినిమా పూర్తయినంతవరకు ఫైట్ మాస్టర్ రాజునీ, సాంబశివరావులను ఎస్కార్ట్‌గా పెట్టారు. అంత నియమ నిష్టలతో నిర్మాణం పూర్తి చేసుకుంది. ఆ చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు. పల్నాటియుద్ధం చిత్రంలో బాల చంద్రుడిగా యన్.టి.ఆర్ ప్రోత్సహించాడు.

అక్కినేని అమర శిల్పి జక్కనతో తండ్రిని ఎదిరించిన కొడుకుగా నటించాడు. గుండమ్మ కథ చిత్రంలో జమున సోదరుడిగా నటించాడు హరనాథ్ . విశిష్టమైన శైలి, కుప్పిగెంతుల జోలికి పోకుండా సహజమైన నటన ప్రదర్శించడం హరనాథ్ సొంతం.

యన్.టి.ఆర్ సోదరుడిగా నటించిన మరో చిత్రం మహానటి సావిత్రి నల్లపిల్లగా నటించిన "నాదీ ఆడజన్మే!" ఈ చిత్రంలో మొట్టమొదటిసారిగా జమున హరనాథ్‌కి జంటగా నటించింది. ఇద్దరికీ ఈడుజోడూ సరిగ్గా సరిపోయిందని అఖిలాంధ్ర ప్రేక్షకులు సంబరపడ్డారు. హరనాథ్‌తో వరుసగా

'మూగ మనసులు'లో...

పల్నాటియుద్ధం, లేత మనసులు, చదరంగం, మా ఇంటి దేవత చిత్రాల్లో నటించారు.

'పాకీజా' హిందీ రీమేక్ చిత్రమే మా ఇంటి దేవత. నాదీ ఆడజన్మే చిత్రం తర్వాత జమున, హరనాథ్ చిత్రాలకు జేజేలు పలికారు. 'లేత మనసులు' చిత్రంలో ఇద్దరి కాంబినేషను ఆదరణ పొందింది. అలాగే పాల మనసులు చిత్రం కూడా. పెళ్ళి రోజు, చదరంగం చిత్రాల్లో కూడా ఈ జంట అంతే కనువిందు చేసింది.

సుఖ దు:ఖాలు, చిట్టి చెల్లెలు, శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న, శ్రీరామకథ, కథానాయిక మొల్ల చిత్రాల్లో ప్రధానపాత్రల్లో నటిస్తున్న సమయంలో తాగుబోతు ముద్ర పడి... హీరోగా బుక్ చేసుకున్న వారంతా అడ్వాన్సులు తీసుకున్న వాళ్ళు కొందరైతే వదులుకున్నవారు మరికొందరున్నారు. అదే హరనాథ్ మనసును గాయపరిచింది. నిజానికి అప్పటికి అగ్రనటుడిగా కొనసాగుతున్న చాలా మంది కంటే చిన్న వయసు హరనాథ్‌ది. కానీ ఈ దుష్ప్రచారం అతన్ని కుంగతీసింది.

ఒక్క పక్క సినిమాలు లేవు. మరో పక్క చూసే వాళ్ళందరూ ముఖం చాటేసుకున్నారు. కనీసం చిన్న వేషాలు కూడా ఆఫరు చేసిన పాపాన పోలేదు. ఆ సమయంలోనే 'మా ఇంటి దేవత' చిత్ర నిర్మాణం మొదలు పెట్టాడు హరనాథ్. డబ్బు లేదు. హీరో కృష్ణ, హీరోయిన్ జమున సహకరించారు. డైరెక్టర్ పద్మనాభం కూడా అప్పటికి చాలా ఫాల్ డౌన్‌లో వున్నాడు. ఆ సమయంలో హరనాథ్ ప్రసాద్ స్టూడియోస్‌లో ప్రెస్‌మీట్ పెట్టాడు. హరనాథ్ మాటలు మరిచిపోలేం.

'పెంపుడు కూతురు'లో

'బహుశా ఇదే నా చివరి చిత్రం కావచ్చు... ఈ చిత్రం విడుదల నేను చూస్తానో చూడనో, నన్ను బతికుండగానే బలవంతంగా చంపుతున్నారు. కొంతమంది పెద్ద మనుషులు. అందుకు బతకాలని వుంది మళ్ళీ. హరనాథ్ రాజేమిటో నిరూపించాల నుంది. దయచేసి నన్ను బతికించండి! ఈ సినిమాని విజయవంతం చెయ్యండి. ఈ హరనాథ్ రాజు ఎప్పుడూ ఏ ఒక్కరిని ఏది అడగలేదు. అడగను. కాని మిమ్మల్ని అర్థిస్తున్నాను. ఈ సినిమాని విజయవంతం చెయ్యండి! అంటుండగానే హరినాథ్ గొంతు మూగబోయింది. జమున కూడా చెమర్చిన కళ్ళతో హరనాథ్‌ని ఓదార్చింది. ఎవరి దగ్గర్నుండీ ఏ సహాయం తీసుకోకుండా రాజాలా అనంత వాయువుల్లో కలిసిపోయాడు. పగవారికి కూడా ఇటువంటి ముగింపు వుండకూడదని కోరుకుందాం!

- ఇమంది రామారావు
9010133844

అమ్మ మనసు

ఈ అమ్మకు 72 మంది పిల్లలు. అందరూ అనాథలే. పెంపుడు తల్లే అయినా అందర్నీ గారాబంగా పెంచుతోంది. మంచి చదువులు చెప్పిస్తూ మంచి భవిష్యత్తును అందిస్తోంది. ఆర్థిక సమస్యలు ఎదురైనా వెనక్కు తగ్గడంలేదు. ఒకప్పుడు మిలియనీర్ అయిన చైనాలోని హెబీ ప్రావిన్స్‌కు చెందిన లి లి యువాన్ అటు వస్త్ర పరిశ్రమలోను, ఇనుప ఖనిజం వ్యాపారాల్లో చక్రం తిప్పింది. 1980లో వ్యాపారం మహర్దశలో ఉన్నప్పుడు పిల్లల్ని చేరదీయడం ప్రారంభించింది. గనుల ప్రమాదాల్లో మరణించినవారి పిల్లలు అనాథలవడం ఆమెను కలచివేసింది. తరచూ అవే దుర్వార్తలు వినాల్సి వస్తుండటంతో ఆ పిల్లల బాధ్యతల్ని తీసుకుంది. జబ్బు పడిన పిల్లలనూ చేరదీసింది. వైద్యంతో పాటు పోషణను తానే భరిస్తోంది. కానీ, 2008లో ఆమె వ్యాపారానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పట్టణీకరణ వల్ల ఆమె గని మూతబడింది. కొన్ని రోజులు ఎలాగోలా నెట్టుకొచ్చిన ఆమె డబ్బంతా నిండుకోవడంతో తన ఆస్తుల్ని అమ్మేసి పిల్లల కోసం ఉపయోగించింది. అవీ సరిపోక అప్పులు చేసింది. 2011లో ఆమెకు క్యాన్సర్ అని తేలింది. తనకన్నా పిల్లల బాగోగులే ముఖ్యమనుకుంది లి లి. తనను సరిగా పట్టించుకోవడం లేదంటూ సొంత బిడ్డ జియావో కూడా దూరమయ్యాడు. 2004లో తన వెన్నెముకకు గాయమైతే సరిగా పట్టించుకోకుండా ఎవరో పరాయి వాడికి సేవలు చేసిందనేది అతడి ఆక్రోశం. నిజానికి ఆ చిన్నారికి హైడ్రోసెఫెలస్ అనే సమస్య. వారిని కంటికి రెప్పలా చూసుకోవాలి. జియావోను చూసుకునేందుకు తన తల్లి ఉందని లి లి భావించింది. కష్టాల్లో ఉన్న లి లికి సాయంగా పలువురు ఆర్థిక సాయం అందించారు. అదీ కొంత వరకే ఉపయోగపడింది. ఆమె తను పెంచుతున్న బిడ్డల్ని వేరేవారికి ఇవ్వాలంటే న్యాయ సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పుడామె అప్పులు రెండు కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. వ్యాపారం అనుకూలంగా మారితే అదే మాత్రమనే మొండి ధైర్యంతో ముందుకెళుతోంది. ఒక్క బిడ్డ బాధ్యతల్ని వదిలేందుకు ఇష్టపడటంలేదు 47 ఏళ్ల లి లికి. అమ్మ మనసంటే అదేనేమో. అదే చైనాలో మరో తల్లి మనసు ఇలాంటిదే. కాంగ్ జెనియాన్ అనే 65 ఏళ్ల మహిళ కూడా 40 ఏళ్లుగా 39 మంది పిల్లల ఆలనా పాలనా చూసుకుంటోంది.



రోడ్డెక్కిన ట్వీట్లు

వర్షాకాలం వచ్చిందంటే రోడ్డు మీద కాలు పెట్టడానికి జంకుతారు. ఎక్కడికక్కడ గుంతలతో బళ్లను ఎప్పుడు బోల్తా కొట్టిద్దామా అని అవి నోళ్లు తెరుచుకుని ఎదురు చూస్తుంటాయి. ఎంత మంచి బండి తీసినా ప్రాణాలు అరచేత పెట్టుకుని నడపాల్సిందే. ఈ పరిస్థితి విదేశాల్లోను ఉంది. అయితే ఇక్కడ మనం ఫిర్యాదు చేస్తే అక్కడ గుంతలే మన తరపున అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నాయి. ట్వీట్లతో తమను సరిచేయమని సందేశాలు పంపిస్తున్నాయి. రిపబ్లిక్ ఆఫ్ పనామాలోని పనామా సిటీ ఇప్పుడు దుబాయ్ ఆఫ్ లాటిన్‌గా పిలవబడుతోంది. చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రాజధాని నగరం దూకుడుకు కళ్లెం వేస్తున్నాయి అక్కడి రోడ్లు. ఎక్కడికక్కడే గుంతలతో ప్రయాణీకులకు నరకం చూపిస్తున్నాయి. ఎన్ని ఫిర్యాదులు చేసినా, ఎన్ని సార్లు కలిసినా, నిరసనలు తెలిపినా అధికార గణం పట్టించుకోకపోయేసరికి టెలిమెట్రో అనే న్యూస్ షో నిర్వాహకులు ఓ ఆలోచన చేశారు. సోషల్ మీడియాను పక్కాగా ఉపయోగించుకుని అధికారులకు కునుకు పట్టకుండా చేస్తున్నారు. అదేదో సోషల్ మీడియా ఉద్యమం, ప్రచారంలా కాదు. అక్కడి గుంతలకు ట్విట్టర్ అకౌంట్‌లు తెరిచి తమ మీదుగా ఏదైనా వాహనం వెళితే వెంటనే అధికారులకు ట్వీట్ చేసేలా పరికరాల్ని గుంతల్లో పెట్టారు. క్షణ క్షణానికి గుంతల మీదుగా వెళ్లే వాహనాలు ఈ పరికరాల్ని తొక్కగానే ట్వీట్ వెళ్లిపోతుంది. మోషన్ సెన్సివిటీ డివైస్‌లున్న ఈ పరికరాలు గుంతలకు అతుక్కుని ఉంటాయి. అధికారులు చర్యలు తీసుకుని గుంతలు పూడ్చేంత వరకు ఎన్ని వాహనాలు వాటి మీదుగా ప్రయాణిస్తే అన్ని ట్వీట్లను కొడతాయవి. ఎంత ప్రమాదకరంగా, భయంకరంగా రహదారులున్నాయో అధికారుల కళ్లకు కట్టేలా చేసేందుకు ఈ తరహా పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని న్యూస్ షో నిర్వాహకులు చెబుతున్నారు. ఎంత ఎత్తు ఆకాశ హర్మ్యాలున్నా నగరం నడవాల్సింది రోడ్లపైనే అనే విషయం పాలకులు మరిచిపోయారని ట్వీట్లను కురిపిస్తున్నారు. నగరంలోని చెత్త రహదారులపై ఏకంగా ఓ సర్వే నిర్వహించి మ్యాప్ చేశారు. ఆ ప్రాంతంలో ప్రయాణిస్తున్నవారి ట్వీట్లను వీటికి జోడించారు. వీటిలో కాస్త చమత్కారాన్ని మిళితం చేసి అధికారులకు చురకలు అంటిస్తున్నారు వారు. ఈ కుదుపులకు నా కడుపులో ఉన్న బిడ్డ బ్లర్‌గా పుడుతుందని ఓ గర్భిణి, కారు వదిలేసి యుద్ధ ట్యాంకు కొంటే సరి అని మరో చోదకుడు, విరిగిన పార్ట్‌లతో ఇండస్ట్రీ పెట్టే ఆలోచనలో ఉన్నట్టు మరో క్యాబ్ డ్రైవర్ ట్వీట్లను విసిరారు. ఇదంతా పెద్ద అలజడి రేపడంతో అధికారులతో అత్యవసర సమావేశమే జరిపి చర్యలకు ఉపక్రమించారు సంబంధిత శాఖ మంత్రివర్యులు.

మూడ్ మార్చేస్తుంది

మత్తు మందు అనే మాటే రాకుండా, మందు తాగకుండా, సిగరెట్లు లేకుండా, ఆఖరకు టీ చుక్కలు పడకుండా మీ మూడ్ మార్చేస్తుంది 'థింక్' అనే పరికరం. హార్వర్డ్, ఎంఐటీ, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాలకు చెందిన శాస్త్ర, సాంకేతిక నిపుణులు రూపొందించిన ఈ పరికరం న్యూరో సిగ్నల్లింగ్ వ్యవస్థ ద్వారా మన మెదడుకు సంకేతాలు పంపి మనం కోరుకున్న మూడ్‌లోకి తెప్పిస్తుంది.

చేయాల్సిందల్లా దానిని తలకు తగిలించుకుని, ఫోన్‌లోని యాప్ ద్వారా ఏ మూడ్ కావాలో దాన్ని టచ్ చేయడమే. సంతోషం, ప్రశాంతత, ఏకాగ్రత, శక్తివంతం ఇలా ఏ మూడ్‌లోకైనా చిటికెలో తీసుకెళ్లిపోతుందిది. ఈసీజీ ద్వారా మెదడు న్యూరాన్ల యాక్టివిటీని పరిశీలించి ఎలక్ట్రికల్ లేదా అల్ట్రాసౌండ్ తరంగాల్ని పంపుతుంది. అవి సంబంధిత మూడ్‌ను ప్రభావితం చేసే మెదడు ప్రాంతాలకు చేరి న్యూరాన్ల యాక్టివిటీని మార్చుతాయి. ఎంత స్థాయిలో మూడ్ ఉండాలనే దాన్ని కూడా మనం నియంత్రించొచ్చు. అరగంట నుంచి గంట పాటు ప్రభావం ఉండేలా చూసుకోవచ్చు. దీన్ని ప్రయోగశాలల్లోను బయటా 3,700 మందిపై ప్రయోగించి చూశారు. మంచి ఫలితాలు కనిపించడంతో మార్కెట్‌లోకి విడుదల చేశారు. ధర సామాన్యుడికి అందితే గొప్ప మార్పులు సమాజంలో చోటు చేసుకుంటాయని విమర్శకులు భావిస్తున్నారు.

దిక్కులు పిక్కటిల్లే ఉరుముల గర్జనలు. పట్టపగల్లు కంటిని పొడిచే చీకట్లు. రాలే చినుకులకు పోటీగా పిడుగులు. రోజులు, వారాలు వెరవని కుండపోత వర్షం. ఎడతెరిపి లేకుండా ఆరునెలల పాటు వానలో నానే గ్రామం మన దేశంలోనే ఉంది. పాదాల్ని తాకుతూ వెళ్లే మలయ మారుతాలు, పచ్చగా తడారని అడవులు, ఎప్పుడూ సడి చేసే సెలయేళ్లతో భూలోక స్వర్గ ధామంగా నిలిచిన ప్రాంతమది. ప్రపంచంలోనే అత్యంత తడి ప్రాంతంగా గుర్తించిన ఆ ప్రాంతం అందరూ అనుకునేట్టు చిరపుంజి కాదు.. మాసిన్రామ్. మేఘాల డోలికల్లో ఆటలాడుతూ,చినుకుతడికి పరవశించిన పువ్వులా అందాల్ని వికసిస్తుంది ఆ చెమ్మనైన ప్రాంతం.

ఆరు నెలలు వానే

చిరపుంజికి దగ్గరలోనే ఉన్న కుగ్రామాల క్లస్టర్ ఈ ప్రాంతం. ప్రపంచంలో అత్యధికంగా వర్షపాతం నమోదైన గ్రామంగా గిన్నిస్ బుక్ రికార్డులకు ఎక్కింది మాసిన్రామ్. మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌కు కేవలం 65 కిలోమీటర్ల సమీపంలోనే ఉంటుంది. మేఘాలకు ఆలయమైన ఆ రాష్ట్రంలో అధిక వర్షపాతం సాధారణమే అయినా ఈ ప్రాంతంలో మాత్రం అది అతి తీవ్రం. మేఘాలను తమకు వస్త్రంలా చుట్టుకునే ఖాసీ కొండల్లో ఈ ప్రాంతం విస్తరించి ఉంది. ఇంత దుర్భేద్య వాతావరణ పరిస్థితుల్లోను స్థానిక ఖాసీ ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఆరు నెలలు ఓపిగ్గా ఇళ్లలో నిరీక్షిస్తే వసంతం వచ్చేస్తుందని చాలా తేలిగ్గా చెప్పేస్తారు. అందాక బుట్టల్ని, చీపుర్లను అల్లుతూ, వారి ప్రత్యేకత అయిన టర్బాన్ శాలువాలను నేస్తూ గడుపుతారు. మబ్బులు వీడినా చెమ్మ ఆరని ఆ ప్రాంతంలో వర్తక వాణిజ్యాలు చేసుకుంటారు. మబ్బులన్నీ కరిగి చలికాలం వచ్చేస్తే తీరిగ్గా ఇంటి మరమ్మతులకు కుటుంబమంతా కదులుతుంది. అంత అలజడి సృష్టించే వర్షంపై వారికి చాలా గౌరవం. వర్షాకాలం పూర్తయింది కదా అని ఏ పండగ పబ్బం చేసుకుని సంతోషాల్లో మునిగిపోరు. వెంటనే పనుల్లో నిమగ్నమై రహదారులు, మార్కెట్లను సరిచేసుకుంటారు. విరిగిపడిన కొండ చరియల్ని పక్కకు తొలగించడం, వరద నీరు కూల్చేసిన నిర్మాణాలను పునరుద్ధరించడానికే చాలా రోజులు పడతాయి.

రికార్డు వర్షపాతం విషయంలో కొలంబియాలోని లియోరో, లోపెజ్ డెల్ మికాయ్ ప్రాంతాలతో వివాదముంది. కానీ, 1985లో ఇక్కడ కురిసిన 26,000 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుతో వాటిని పక్కకు నెట్టింది. సముద్ర మట్టానికి 7000 అడుగుల ఎత్తులో బంగాళా ఖాతం దగ్గరగా ఉండటం వల్ల ఈ స్థాయి వర్షపాతానికి కారణం. ఇక్కడ భారీగా గుంపులు గుంపులుగా ఉండే కొండల వల్ల ఋతుపవనాల మార్గం బాగా ఇరుకై నొక్కుకునేలా వెళ్లడంతో కుండపోత కురుస్తుం దని వాతావరణ నిపుణుల వివరణ. స్థానిక జలాశయాల నుంచి తయారయ్యే మేఘాలు కొండల్ని చుడుతూ పైకి లేచే క్రమంలో చల్లబడి వర్షిస్తాయి. మే, జూలై నెలల్లో వర్షం తన ప్రతాపాన్ని చూపిస్తుంది.

అంత వర్షం పడినా అక్కడ మంచినీటి లభ్యత కష్టమే. విద్యుత్ సదుపాయం ఉన్నా కోతలే ఎక్కువ. ఆ గ్రామాలను కలుపుతూ ప్రధాన రహదారి ఒక్కటే ఉంది. అక్కడ ప్రత్యేకంగా పెరిగే గడ్డితో వారు తమ ఇళ్లను నిర్మించుకుంటారు. అది చక్కటి సౌండ్ ప్రూఫ్‌గా పనిచేసి ఉరుములు, పిడుగుల శబ్దాలను తగ్గిస్తుంది. కుండపోతగా కురుస్తున్న చినుకుల శబ్దం వల్ల గ్రామస్తులు పెద్ద గొంతుకతో మాట్లాడుకుంటారు. వారికి ఆ వాతావరణం ఎంతలా అలవాటైందంటే ఏ చింత లేకుండా జీవనం సాగిస్తున్నారు. గ్రామాన్ని, వర్షాన్ని ప్రేమిస్తూ హాయిగా బతికేస్తున్నారు. నెలల ముందు నుంచే వర్షాకాల పరిస్థితులకు సన్నద్ధమవుతారు. వంటచెరకును అడవి నుంచి సమకూర్చుకుంటారు. అదే వారి వంటకు, కాంతికి ఆధారం. ఆహార ధాన్యాలను నిల్వ చేసుకుంటారు. క్నప్ అనే ఛత్రం ఇక్కడ ప్రత్యేకం. మోకాలి వరకు ఉండే ఈ గొడుగులను వెదురు చీలికలు, ప్లాస్టిక్ పట్టాలు, చీపురు గడ్డితో తయారు చేస్తారు. చూడ్డానికి తాబేలు డొప్పలా ఉండే ఈ గొడుగులను శరీరానికి కట్టుకుని పనులు చేస్తుంటారు. రెండు చేతులతో సులువుగా పనిచేసుకునేలా చాలా నేర్పుగా వీటిని స్థానిక మహిళలు తయారు చేస్తారు. ఈదురు గాలుల్లోను పనులు చక్కబెట్టుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి. చీపురు గడ్డిని నీటిలో తడిపి చెక్క దిమ్మెలతో వాటిని బల్లపరుపుగా చేసి ఎండబెడతారు. దీనివల్ల గడ్డి చాలా దృఢంగా మారుతుంది. ఇక్కడ తయారు చేసిన చీపుర్లు, బుట్టలు, శాలువాలు ఎగుమతి అవుతాయి. వర్షాకాలానికి ముందు కొందరు వేరే ప్రాంతాల్లో ఉన్న తాత్కాలిక నివాసాలకు తరలిపోతారు. స్థానికుల పేర్లు గమ్మత్తుగా ఉంటాయి. మూన్‌స్టార్ అనే పేర్లు ఇక్కడ సాధారణం. బ్రిటీష్ కాలనీలు, మిషనరీల ప్రభావం వల్ల వీరు అలా పేర్లు పెట్టుకోవడం అలవాటైంది. చాలామందికి వాటి అర్థాలు తెలీదు.

ప్రకృతి వంతెనలు

ప్రకృతిని తమకు అనుకూలంగా మార్చుకోవడంలో వీరికి వీరే సాటి. రబ్బర్ చెట్ల వేర్లను ఒకదానికొకటి వెదురు బొంగుల ద్వారా అల్లుకునేలా చేసి వంతెనలు నిర్మించుకుంటారు. సజీవ వంతెనలుగా ఆశ్చర్యం గొలిపే వీటి ద్వారానే అడవుల్లో, గ్రామాల్లో తిరుగుతుంటారు. కొన్ని చాలా విశాలంగా మన కాంక్రీట్ వంతెనల పొడవు ఉంటాయి. చాలా దృఢంగా మారేందుకు ఏళ్ల తరబడి వేచి చూస్తారు. కొన్నింటికి దశాబ్దాల కాలం పడుతుంది. ఇలాంటి వంతెనలు ప్రపంచంలో మరెక్కడా కనబడవు. ఇలా ప్రకృతితో మమేకమై అసాధారణ వాతావరణానికి అనుకూలంగా మారి బతుకు బండిని లాగించేస్తున్నారు.

హైదరాబాద్ మహానగరాన్ని పాలించిన నిజాం నవాబుల కాలంలో ఎన్నో భవంతులు, విశ్రాంతి మందిరాల నిర్మాణం జరగ్గా, ప్రస్తుతం చాలామంది ధనవంతుల భవనాలు ప్రభుత్వ కార్యాలయాలుగా, విశ్వవిద్యాలయాలుగా, వైద్యాలయాలుగా ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అలాంటి ఒక వసతి గృహం నేటికీ చెక్కు చెదరకుండా ప్రస్తుతం రాష్ట్రపతికి ఆతిథ్యమిస్తోంది.. హైదరాబాద్‌లోని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం. శీతాకాల విడిది సందర్భంగా రాష్ట్రపతి ఇక్కడ బస చేయడం ఆనవాయితీ.

రాష్ట్రపతికి మన ఆతిథ్యం

సికింద్రాబాద్ నుంచి 10 కి.మీ దూరంలో సిద్ధిపేటకు వెళ్ళేదారిలో లోతుకుంట అనే ప్రాంతానికి దగ్గర్లో రాష్ట్రపతి నిలయం ఉంది. దీన్ని పురాతన, వారసత్వ కట్టడంగా ప్రభుత్వం ప్రకటించింది. సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో దట్టమైన పురాతన చెట్ల నీడలో రాష్ట్రపతి నిలయం ఆనాటి రాచరికపు తీపి గుర్తుగా నిలుస్తుంది. సికింద్రాబాద్ దగ్గరలోని బొల్లారంలో అప్పటి నిజాం నవాబు "నజీర్ ఉద్ దౌలా" 1860లో తన విశ్రాంతి మందిరంగా ఈ భవనాన్ని నిర్మించారని తెలుస్తుంది. దాదాపు 93 ఎకరాల సువిశాల ప్రాంతంలో ఉన్న ఈ ప్యాలెస్ చుట్టూ 50 అడుగుల ఎత్తులో ఉండే గోడలు నిర్మించి కనుచూపు మేరలో ఉండగానే శత్రువుని కనిపెట్టేందుకు వీలుగా నిర్మాణం జరిగింది. నిత్యం నిజాం సైనికులు కనుసన్నల్లో ఉండేది. తదుపరి పరిపాలన సర్ సాలార్జంగ్ చేతికి వచ్చాక ఇది ప్రధాన సైనిక అధికారి కార్యాలయంగా మార్చారు. ఇక్కడే సైనికులకు శిబిరాలను ఏర్పాటు చేసి యుద్ధ విద్యలో శిక్షణ ఇచ్చేవారు. ఆ తరువాత బ్రిటిష్ పాలకులతో కుదిరిన ఒప్పందం మేరకు బ్రిటిష్ సైన్యానికి స్థావరాలుగా మార్చేశారు. బ్రిటిష్ సైనికాధికారులు సైతం తమ నివాస గృహంగా మార్చేసుకున్నారు. అప్పట్లో దీనిని "బ్రిటిష్ రెసిడెన్సీ" అని పిలిచేవారు.

స్వాతంత్ర్యం వచ్చాక చిన్న చిన్న రాజ్యాలు, సంస్థానాలన్ని సువిశాల భారతదేశంలో ఐక్యం కాగా, హైదరాబాద్ సంస్థానం విలీనం చేయడానికి మాత్రం నిజాం ఒప్పుకోలేదు. పైగా ప్రజలపై వేధింపులు పెరిగిపోయాయి. నిజాం పాలన తట్టుకోలేని ప్రజలు 'ఆంధ్ర మహాసభ' ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలు, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. చివరకు భారత ప్రభుత్వం నిజాం సైనికులపై పోలీస్ చర్యకు పాల్పడింది. ఇది 5 రోజుల పాటు జరిగాక నిజాం తన సంస్థానాన్ని భారత ప్రభుత్వంలో విలీనం చేశాడు. భారత ప్రభుత్వం సైనిక స్థావరాలను కంటోన్మెంట్ ప్రాంతంలో ఏర్పాటు చేసి అక్కడ ఉన్న ప్యాలెస్‌ని మిలిటరీ అధీనంలోకి తీసుకుంది.

డైనింగ్ హాల్

ఆపై భారత రాష్ట్రపతి విడిది నివాసంగా ఏర్పాటు చేశారు.

రాష్ట్రపతి నిలయం ఢిల్లీతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఉండాలనే, ప్రజల బాగోగులు తెలుసుకోవాలనే ఉద్దేశంతో విడిది భవనాల్ని ఒకటి ఈశాన్య రాష్ట్రాలలోను మరొకటి దక్షిణాదిన ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈశాన్య రాష్ట్రాలు సిమ్లాలో, దక్షిణాది రాష్ట్రాలకు హైదరాబాద్‌లో ఆతిథ్యమిస్తున్నారు. కేవలం పర్యటనలకే కాక వాతావరణం ఇబ్బందుల దృష్ట్యా విడిది ఏర్పాట్లు చేశారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఉంటుంది. ఈ భవనంలో మొఘల్ గార్డెన్స్‌కి ధీటుగా ఆరోగ్యాన్ని పెంచే మూలికా వనాల నడుమ నిత్య పచ్చదనంతో శోభాయమానంగా ఉంటుంది. అన్ని కాలాల్లో ఆహ్లాదకరంగా ఉండే అద్భుత వాతావరణం ఉన్న ఈ భవనానికి కొత్త సొగసులద్ది రాష్ట్రపతి నిలయంగా మార్చారు.

దాదాపు 150 ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ భవనంలో 20 నివాస గదులు ఉన్నాయి. వీటన్నింటిని 3 విభాగాలుగా విభజించారు. ప్రెసిడెంట్ వింగ్, ఫ్యామిలీ వింగ్, ఎడిసి వింగ్‌గా పిలవబడుతున్నాయి. ప్రత్యేకంగా పెద్ద డైనింగ్ హాల్, మార్నింగ్ రూం, డైనింగ్ హాల్ ప్రత్యేకంగా ఉంటాయి. ఈ డైనింగ్ హాళ్ళకు ప్రత్యేక వంట గదులుండటమే కాదు, ఒకదాని నుండి మరొక దానిలోకి వెళ్లగలిగేలా రూపొందించారు.. నాటి నిజాం ప్రభువులు. ప్రస్తుతం ఈ గదులన్ని అత్యాధునిక పరికరాలతో నిండిపోయాయి. ఈ భవనం నిర్మాణం 20-25 అడుగుల ఎత్తులో ఉండటం, అన్ని భవనాల్ని కలుపుతూ చుట్టూ ఉన్న విశాలమైన వరండా వల్ల ఈ నిర్మాణం చూడముచ్చటగా ఉంటుంది.

శీతాకాల విడిది

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా మన దేశ ప్రథమ పౌరుడిగా మొదటి రాష్ట్రపతి డా॥ బాబు రాజేంద్రప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణ, వి.వి.గిరి , డా॥ నీలం సంజీవరెడ్డి తదితరులు క్రమం తప్పకుండా ప్రతి ఏటా 15 రోజులు బస చేసేవారు. 2000లో కె.ఆర్.నారాయణన్ వచ్చారు. ఆ తరువాత జ్ఞాని జైల్ సింగ్ వచ్చినప్పుడు కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలకు విధిగా హాజరయ్యేవారు. ఈ ప్రాంతం చాలా సుందరంగా ఉందని కితాబు ఇచ్చారు. అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ఉన్నప్పుడు హైదరాబాద్ వచ్చినప్పుడు ఎక్కువగా శాస్త్రవేత్తలతోనూ, విద్యార్థులతోనూ సమావేశం అయ్యేవారు. ప్రతిభా పాటిల్ వచ్చినప్పుడు బొల్లారంలో మూలికా వనాన్ని ప్రారంభించారు. 2011 నుంచి రాష్ట్రపతి పర్యటన అనంతరం ఒక వారం రోజుల పాటు జంట నగరాల్లో సాధారణ పౌరులకు ఈ నిలయాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తున్నారు.

మూలికా వనం

ప్రకృతి ప్రేమికుల కోసం నాటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ 2010 జనవరి 10న మూలికా వనాన్ని ప్రారంభించారు. ఈ గార్డెన్ కోసం 35 ఎకరాలు కేటాయించి వనమూలికల వృక్షాలను వివిధ ప్రదేశాల నుంచి సేకరించి సుందర వనంగా తీర్చిదిద్దారు. 111 రకాల పూల మొక్కల్ని ఇక్కడ చూడవచ్చు. వివిధ రకాల రోగాలను నయం చేసే హెర్బల్ మొక్కలు పెంపకానికి 7000 చదరపు మీటర్ల స్థలాన్ని కేటాయించారు. సర్పగంధ, కలబంద, కొత్తిమీర, నిమ్మగడ్డి, గంధం, గడ్డదినుసు, మల్లె, తులసి వంటి మొక్కల్ని పెంచుతున్నారు. సి.పి.డబ్ల్యు.పి, ఆంధ్రప్రదేశ్ వనమూలికల శాఖ కృషితో వనాన్ని విస్తరించారు. మొఘల్ గార్డెన్స్‌కు ధీటుగా డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో సాగు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ కోరిక మేరకు ప్రజల సందర్శనార్థం అనుమతిస్తున్నారు.

అనంతోజు మోహన్ కృష్ణ

8897765417

సందర్భం

ముళ్ళపూడి వెంకట రమణ... ఆ పేరుకు వేరే పరిచయం అక్కర్లేదు. రమణ ఒక రచన... ఆ పక్కనే ఓ గీత. అదే బాపు... కలిస్తే అదో కళాఖండం.. కొన్నేళ్ళ పాటు తెలుగు చలన చిత్ర రంగంలో తమదైన బాణీలో అద్వితీయమైన చలన చిత్రాలను అందించారు. రమణ అందరికీ రచయితగా ఎక్కువ పరిచయం. ఆయనలో ముఖ్యమైన కోణం ఒకటుంది. అది చిత్ర నిర్మాత. దాదాపు ఇరవై సినిమాలకు ఆయన నిర్మాతగా వ్యవహరించారు. తొలి చిత్రం సాక్షి నుంచి మొన్నటి 'రాధా గోపాళం' వరకూ ఆయన ఈ పాత్ర కూడా పోషించారు. ఎవరికీ ఒక్క పైవ్ కూడా అప్పు లేరు.

ఒక్క పైవ్ కూడా అప్పు లేరు

నిర్మాతగా ఆయన ఎంతో నిక్కచ్చిగా వ్యవహరించేవారు. అణా పైసలతో సహ ప్రతి ఒక్కరికీ సొమ్ము చెల్లించేవారు. ఏనాడు ఎవరికీ బాకీ లేరు. ఓ పైవుంటే అప్పియ్యవ్వోయ్ అనే డైలాగ్ నిత్యం గుర్తుంచు కుంటారో ఏమోగానీ, ఇవ్వాల్సింది ఎగ్గొట్టలేదు. అందుకు చాలా ఉదాహరణలు న్నాయి. రెండిం టిని తప్పనిసరిగా గుర్తు చేసుకోవాలి. మొదటిది గోరంత దీపం చిత్రం. కథాపరంగా చక్కని చిత్రమైనప్పటికీ బాక్స్ఆఫీసు దగ్గర బోల్తా పడింది. అయినా ఆయన తన బాధ్యత నుంచి పారిపోలేదు. మొత్తం యూనిట్ అందరికీ అణా పైసలతో చెల్లించారు... హీరోయిన్ వాణిశ్రీ గారికి మాత్రం... 16వేల రూపాయలు బాకీ పడ్డారు. చిత్రం ఫ్లాప్ అయ్యింది కదా ఏమడుగు తాములే అని వాణిశ్రీ కూడా మిన్నకున్నారు. దాని గురించి మరిచారు కూడా. మూడేళ్ళ తరవాత ఆమెకో చెక్ అందింది... కింద రమణ గారి సంతకం. వెంటనే ఆమె ఆయనకు ఫోను చేశారు. ఏమిటండి చెక్కు పంపారు... దేనికిది అని అడిగారు. అవునమ్మా... అది గోరంతదీపం సినిమాకు నేను నీకు ఇవ్వవలసిన మొత్తం ప్లస్ మూడేళ్ళకూ వడ్డీ కలిపి అని సమాధానమిచ్చారు. అయ్యో! ఆ విషయాన్నే మరిచాను. ఫరవాలేదండి ఇవ్వకపోయినా వెనక్కి తీసుకోమని అడిగారు. రమణగారు తిరస్కరిం చారు. మీకు రావలసిన పారితోషికం... మీరు తీసుకోవలసిందేనని చెప్పారు. ఈ విషయాన్ని రావి కొండలరావు గారి దగ్గర ప్రస్తావించి నప్పుడు... అవునండి నిజమే.. ఎంతమందుం టారు ఇలాంటి నిర్మాతలు... ఒక్కరికి ఒక్కపైసా కూడా బాకీ ఉండేవారు కాదని చెప్పారాయన. తన వరకూ రెండు అనుభవాలున్నాయని రావి తెలిపారు.

లాంచీలో ప్రయాణిస్తూ రచన

అదే సినిమాకు ముళ్ళపూడి రచయితగా కూడా పనిచేశారు. మొత్తం లాంచీలోనే ఆయన స్క్రిప్టు రచించారు. ఆ సినిమా కోసం ప్రత్యేకంగా పంటునూ, దానికి లాంచీనీ జోడించి కట్టారు. సినిమా కథను ఆయన లాంచీలోనే రాశారు. ఉదయాన్నే లాంచీ ఎక్కడం.. పాపికొండల వరకూ వెళ్ళి తిరిగి రావడం.. ఇలా మూడు రోజులలో కథారచన పూర్తయ్యింది. పైన ఆయనకో గది ప్రత్యేకంగా ఉండేది. కింద భాగంలో కిచెన్. ఆయనకు కావలసిన పుడల్లా కాఫీలు, టీలు... టిఫిన్, భోజనం కూడా అక్కడి నుంచే. కొంతమంది రచయితల్లా ఆయనకు భేషజాలు లేవు. ఒకవేళ హొటల్ గదిలో కూర్చుని రాయాల్సి వస్తే.. అందుకయ్యే ఖర్చును కూడా తనే చెల్లించే వారాయన. అంతటి నిక్కచ్చి మనిషి. రాస్తున్నందుకు మనం నిర్మాత నుంచి తీసుకుంటు న్నప్పుడు... దీనికి మళ్ళీ నిర్మాతే చెల్లించడమేమిటనేది ఆయన ఉద్దేశం

అందాల రాముడు... పారితోషికం

అవి అందాల రాముడు సినిమా రూపొందించే రోజులు.. రమణ గారు నన్ను పిలిచి, మా సినిమాలో చేస్తారా అని రావికొండల రావుని అడిగారు.. తప్పకుండా చేస్తానన్నారు. ఎంత తీసుకుంటున్నా రంటే ఐదువేలని చెప్పా. ఇంత కాలమైనా ఐదు వేలేమిటండి. ఈ సినిమానుంచి వెయ్యి రూపాయలు పెంచుతున్నాను. అలాగే, రాధాకుమారిగారికి కూడా పెంచుతున్నానని చెప్పారు. ఐదు వేలంటే... మూడువేలకి చేస్తావా.. నాలుగు వేలకి చేస్తావాఅనిబేరమాడేరోజుల్లో వెయ్యి రూపాయలు పెంచడం ఆశ్చర్యమేసింది.



అందాల రాముడు చిత్రం కోసం లాంచి నమూనాతో (ఎడమనుంచి) ముళ్ళపూడి వెంకటరమణ, బాపు, సీతారాముడు, నవోదయ రామ్మోహనరావు

పాలు విరిగిపోయాయి..

ఓ సారి అందాల రాముడు చిత్రం షూటింగ్ దేవీపట్నంలో జరుగుతోంది. ఉదయం 4.30కి అందరూ స్పాట్‌కి వెడతారు. వాళ్ళందరినీ లేపి వారితో పాటు రమణ గారు కూడా వెడతారు. కొండలరావుగారికి ఆ రోజు షూటింగు లేకపోవడంతో ఉదయం 7.30కిలేచారు.పడుకున్న రమణగారిని చూశారు. ఏమిటండి ఆరోగ్యం బాగో లేదా అని ప్రశ్నించారు. లేదండి రాత్రి రాజమండ్రి వెళ్ళొచ్చేసరికి ఆలస్యమైంది. రాత్రి పూట 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమండ్రి ఎందుకెళ్ళారో ఆ తరవాత తెలిసి ఆశ్చర్యపోయారు. ముందు రోజు షూటింగ్ ముగించుకుని వచ్చే సరికి పాలు విరిగిపో యాయని వంటవాళ్ళు చెప్పారట. వెంటనే రాజమండ్రిలో తెలుసున్న పాల దుకాణానికి వెళ్ళారట. పాలు తీసుకుని వచ్చేసరికి ఇంచుమించు తెల్లవారు ఝామైంది. ఎందుకండీ అంత రిస్కు తీసు కుని వెళ్ళారంటే... ఎవరికైనా సరే పొద్దున్న లేవగానే కాఫీ పడకపోతే ఎలా... దేవీపట్నం చుట్టు పక్కల ఇన్ని పాలు ఎక్కడ దొరుకు తాయి.. అందుకే వెళ్ళొచ్చానని తాపీగా సమాధాన మిచ్చారట రమణ గారు. యూనిట్‌కు సౌకర్యాలు కల్పించడంలో ఎంతో శ్రద్ధ చూపేవారన దానికి ఇంతకు మించి ఉదాహరణ ఏంకావాలండి అంటూ రావి కొండలరావుగారు ఆయనను గుర్తుచేసుకున్నారు.

- సుబ్రహ్మణ్యం

వి.ఎస్.కూచిమంచి

(28న ముళ్ళపూడి వారి జయంతి సందర్భంగా)

బెండకాయ మటన్

కావలసిన పదార్థాలు

బెండకాయలు-అర కిలో
మటన్-అరకిలో, నెయ్యి-2 టేబుల్ స్పూన్లు,
జీలకర్ర- టీ స్పూను, దాల్చిన చెక్క-2 అంగుళాల
ముక్క, నల్ల యాలకులు-నాలుగు
మిరియాలు-పది, ఉల్లిపాయలు-రెండు
పచ్చి మిర్చి-నాలుగు, అల్లం వెల్లుల్లి-2 టీ స్పూన్లు, పసుపు-అర టీ స్పూను, ఉప్పు-రుచికి సరిపడా, ధనియాల పొడి-2 టీ స్పూన్లు
కొత్తిమీర తురుము-4 టేబుల్ స్పూన్లు
టొమాటోలు- రెండు,నూనె-2 టేబుల్ స్పూన్లు
కారం- టీ స్పూను, గరం మసాల పొడి-టీ స్పూన్లు, కొత్తిమీర తురుము- 4 టేబుల్ స్పూను

తయారు చేయు విధానం

బెండకాయలు కడిగి తొడిమలూ, చివర్లూ తీసేసి ఒకవైపున చీల్చినట్లుగా గాటు పెట్టాలి. ఓ బాణలిలో నూనె వేసి మిగిలిన జీలకర్ర వేసి వేగాక బెండకాయలు వేసి వేయించి ఉంచాలి. ప్రెషర్ కుక్కర్‌లో నెయ్యి వేసి కాగాక అర టీ స్పూను జీలకర్ర దాల్చిన చెక్క, నల్ల యాలకులు, మిరియాలు, ఉల్లిముక్కలు వేసి వేయించాలి. తరువాత చీల్చిన పచ్చిమిర్చి, మటన్ ముక్కలు వేసి వేయించాలి. తరువాత అల్లం వెల్లుల్లి ,ఉప్పు, పసుపు, ధనియాల పొడి వేసి కలపాలి. మంచినీళ్ళు పోసి ఓ సారి కలిపి ఓ పది నిమిషాలు ఉడికించాలి. తరువాత టొమాటో గుజ్జు, కారం, గరం మసాలా వేసి కలపాలి. ఇప్పుడు కొత్తిమీర తురుము వేసి ఉప్పు సరిచూసి కుక్కర్ మూత పెట్టి ఓ విజిల్ రానివ్వాలి. మంట తగ్గించి సిమ్‌లో ఇరవై నిమిషాల పాటు ఉడికించి దించాలి.

చైనీస్ మటన్ బాల్స్

కావలసిన పదార్థాలు

బోన్‌లెస్ మటన్ కీమా- అరకిలో
కోడిగుడ్లు-రెండు, సోయా సాస్-టేబుల్ స్పూను, పంచదార-టీ స్పూను
ఉప్పు-టీ స్పూను, పచ్చి మిర్చి-ఆరు
చైనీస్ క్యాబేజీ తురుము- అర కప్పు
మైదా పిండి-పావు కప్పు,
చైనీస్ సాల్ట్-పావు టీ స్పూను

తయారు చేయు విధానం

కీమాను ఉడికించి ఉంచాలి. కోడిగుడ్ల సొనను బాగా గిలకొట్టాలి. అందులో సోయా సాస్, పంచదార వేసి బాగా కలపాలి. తరువాత ఉడికించిన కీమా, పచ్చిమిర్చి తురుము, క్యాబేజీ తురుము వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఉప్పు చైనీస్ సాల్ట్, మైదాపిండి వేసి కలిపి ఉండలుగా చేయాలి. బాణలిలో నూనె పోసి కాగాక ఈ ఉండల్ని వేసి వేయించి తీయాలి. వీటిల్లోకి కాస్త గ్రేవీ కావాలనుకుంటే విడిగా బాణలిలో కొద్దిగా నూనె వేసి ఉల్లిముక్కలు వేసి వేయించాలి. తరువాత చిల్లీ సాస్, కొత్తిమీర తురుము వేసి అందులోమటన్ బాల్స్ కలిపి అందించాలి.

కొల్హాపురీ మటన్ తంబడా రస్సా

కావల్సిన పదార్థాలు

మటన్-కేజీ, కారం- టేబుల్ స్పూను, నూనె-కప్పు,
టొమాటోలు-రెండు, ఉల్లిపాయలు- నాలుగు
కొత్తిమీర-కట్ట,అల్లం వెల్లుల్లి పేస్టు-రెండు చెంచాలు
పసుపు-పావు టేబుల్ స్పూను
ఉప్పు-తగినంత, నువ్వులు-రెండు టేబుల్ స్పూను
యాలకులు-నాలుగు, కొబ్బరి తురుమ - రెండు టేబుల్ స్పూన్లు, ధనియాల పొడి-టేబుల్ స్పూను
జీలకర్ర పొడి- టేబుల్ స్పూను,మిరియాలు-ముప్పావు చెంచా, దాల్చిన చెక్క-పెద్ద ముక్క,
లవంగాలు -నాలుగైదు,గసగసాలు-టేబుల్ స్పూను
నెయ్యి-రెండు టేబుల్ స్పూన్లు

తయారు చేయు విధానం

బాణలిలో నూనె లేకుండా నువ్వులు, యాలకులు, మిరియాలు, దాల్చిన చెక్క, లవంగాలూ, గసగసాలు వేయించుకోవాలి. తరువాత మెత్తగా పొడిచేసి పెట్టుకోవాలి. అలాగే టొమాటోలు, ఉల్లిపాయలు, కొత్తిమీర, తాజా కొబ్బరి తురుము, ఎండు కొబ్బరి తురుము మెత్తగా రుబ్బి పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడి చేసి అల్లం వెల్లుల్లి పేస్టు వేయించుకోవాలి. అందులో ముందుగా వేసుకున్న మసాలా పొడి వేయాలి. తరువాత కొబ్బరి మిశ్రమం వేయాలి. పచ్చి వాసన పోయాక మటన్ ముక్కలు తగినంత ఉప్పు వేసి మూత పెట్టేయాలి. మటన్ మెత్తగా ఉడికాక ధనియాల పొడి జీలకర్ర పొడి, కారం వేసి కలిపి దింపేస్తే సరిపోతుంది. ఇది బిర్యానీ, రొట్టెల్లోకి చాలా బాగుంటుంది.

చింత చిగురు మాంసం

కావాల్సినపదార్థాలు

చింతచిగురు-అరకిలో మాంసం (చికెన్ లేదా మటన్) ,అరకిలో కొబ్బరి తురుము: 2 టీ స్పూను,
కొత్తిమీర- కట్ట,ధనియాల పొడి-టీ స్పూన్లు
అల్లంవెల్లుల్లిముద్ద- టీ స్పూను, జీలకర్ర- టీ స్పూను, పుదీనా-కట్ట ,ఆవాలు-టీ స్పూను
నూనె-టేబుల్ స్పూను, ఉల్లిపాయ- ఒకటి
కారం -2 టేబుల్ స్పూను, ఉప్పు-రుచికి సరిపడా
పసుపు-చిటికెడు, గరం మసాలా-టీ స్పూను

తయారు చేయు విధానం

నాన్‌స్టిక్ పాన్ తీసుకుని నూనె వేసి ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి. తరువాత ఉల్లిముక్కలు కూడా వేసి అవి వేగాక, పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి వేయించాలి. తరువాత కొబ్బరి తురుము వేసి ఓ నిమిషం వేయించాలి. ఇప్పుడు మటన్ లేదా చికెన్ ముక్కలు వేసి ఉప్పు వేసి తగినన్ని నీళ్ళు పోసి కలపాలి. తరువాత ధనియాల పొడి, కారం కూడా వేసి బాగా కలిపి మూత పెట్టి మాంసం ఉడికే వరకూ ఉంచాలి. ఉడికిన తరువాత చింత చిగురు వేసి మరో ఐదు నిమిషాలు ఉడికించాలి. చివరగా గరం మసాలా వేసి ఓ నిమిషం ఉంచి దించాలి.

క్యూబికల్ లోకం

ఈ గోళం రూబిక్స్ క్యూబ్‌లో బంధీ అయ్యింది. క్యూబ్‌ను తిప్పుతున్న భ్రమలో దానిలోనే పరిభ్రమిస్తోంది. అది చేతిలో పడటం ఆలస్యం మన వేళ్లు తెలీకుండానే క్యూబీస్‌తో డ్యాన్స్ చేస్తుంటాయి. తారుమారైన రంగుల్ని ఓ చోట చేర్చే ప్రయత్నంలో పడి, దాని చుట్టూనే మన ఆలోచనలు చక్కర్లు కొడుతుంటాయి. దాని స్పిన్ మాయాజాలం, రంగుల కలడోస్కోపిలో మునిగితే ఇక కాలం అంతుబట్టదు. ఏ మాత్రం తడబడినా దాన్ని పరిష్కరించే కిటుకు వంటబట్టదు. అరచేతంత ఉండే ఆ చిట్టి క్యూబే ఓ పెద్ద రాజ్యమైంది. రూబిక్స్ క్యూబ్ మీ దగ్గరుందా, అయితే నలభై కోట్ల మంది పైగా క్యూబర్లున్న ఆ క్యూబికల్ లోకంలో మీరూ ఓ క్యూబుడే అన్న మాట.

అది హంగేరీలోని బుడాపెస్ట్. 1974లో వసంత కాలం. కళారంగం కలలు గనే బుడాపెస్ట్ అకాడెమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్‌లో ఇంటిరీయర్ డిజైనింగ్‌లో పాఠాలు సాగుతున్న తరగతి గది. ఆర్కిటెక్చర్‌ను అరటి పండు ఒలిచినంత సులభంగా చెప్పే ఓ ప్రొఫెసర్‌కే అప్పుడు ఓ పజిల్ ఎదురైంది. 3డి డిజైన్‌ను విద్యార్థులకు ఎంత తేలిగ్గా చెబితే వారు అంత లోతుగా ఆ పాఠ్యాంశాన్ని అవగాహన చేసుకుంటారనేది ఆయన ఉద్దేశం.



కానీ అది ఎలా డెమాన్‌స్ట్రేట్ చేయాలో తట్టడంలేదు. అప్పటికి కంప్యూటర్లు తరగతి గదుల్లోకి చొరబడలేదు. బ్లాక్ బోర్డేమో 2డిలో ఉంటుంది. మరి 3డి వివరణ ఎలా? అందరిలానే ఓ క్యూబ్ బోర్డు మీద గీశాడు. అందులో 3డి ఎఫెక్ట్ ఉంటుంది. కొన్ని వస్తువులను తెచ్చాడు ఓ చేత్తో పట్టుకుని వాటిని వివరించాడు. అయినా, అంత ఆసక్తిగా ఏమి సాగడం లేదు ఆ తరగతులు. కానీ, అది చాలా మంచి సబ్జెక్ట్. ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్‌లో అద్భుతాలను సృష్టించగలిగే అంశం. దాన్ని అంతుబట్టించే వస్తువు తయారీకి వర్సిటీ ప్రయోగశాలకు వెళ్లాడు. రకరకాల పరికరాలకు స్కెచ్‌లు వేశాడు. కానీ, అనుకున్న విషయం వాటిలో ఇమడటం లేదు. బాగా ఆలోచించాడు. బ్లాక్‌బోర్డుపై 3డి ఎఫెక్ట్ ఇచ్చిన క్యూబ్ ప్రేరణ అయ్యిందేమో, కదిలే భాగాలున్న క్యూబ్‌ను తయారుచేసేందుకు సిద్ధపడ్డాడు. ఉపయోగించినవి.. చెక్క ముక్కలు, రబ్బర్ బ్యాండ్‌లే. అప్పటికి ఆటోక్యాడ్‌లు అందుబాటులో లేవు, కంప్యూటర్‌లో డిజైన్ చేయడానికి. అయినా తన మేధనుపయోగించి రంగురంగుల చిన్న చిన్న క్యూబులు ఒకదానికి ఒకటి ఇంటర్‌లాక్ అయ్యేలా ఓ కొత్త మెకానిజంతో 3*3*3 క్యూబ్‌ను రూపొందించాడు. వెంటనే విద్యార్థుల చేతికిచ్చాడు. దాని పనితీరుకు ఆయనెంత ఉద్విగ్నుడయ్యాడో అంతకంటే విద్యార్థులు చలించిపోయారు. అది వాళ్ళను తన ఆకర్షణ శక్తితో లాక్కుంది. అది కేవలం డిజైన్‌లా కనిపించలేదు అందులో ఓ పజిల్ కనిపించింది.

దాని అమరికలోని మార్పుల్లోనే

ఆ పజిల్ ఉంది. ఆకర్షణ అదే. నిమిషాలు, గంటలు గడిచిపోతున్నా విద్యార్థులు దాన్ని వదలడంలేదు. తానే నెలరోజులు కష్టపడి ఆ పజిల్‌ను పరిష్కరించాడు. అప్పటికి గానీ, 29 ఏళ్ల ఆ కుర్ర ప్రొఫెసర్‌కు అర్థం కాలేదు.. తాను సృష్టించింది ప్రపంచాన్ని తన చుట్టూ తిప్పుకునే సరికొత్త 3డి పజిల్‌ను అని. దానికి మేజిక్ క్యూబ్ అని పేరు పెట్టి పేటెంట్లు తీసుకున్నాడు. తన క్లాస్‌రూం దాటి ప్రపంచానికి పరిచయం చేసేందుకు బొమ్మల తయారీ కంపెనీల చుట్టూ తిరిగాడు. ఆ ఇంటర్ లాకింగ్ విధానంతో చిన్న బొమ్మల్ని తయారు చేసే సాంకేతిక నైపుణ్యం ఉన్న కంపెనీలు కనిపించడంలేదు. ఆరేళ్లు గడిచిపోయాయి. చివరకు చెస్ పావుల్ని ప్లాస్టిక్‌తో తయారుచేసే ఓ కంపెనీ ముందుకొచ్చింది. కావాల్సిన సాంకేతికతను వివరించి భారీ ఎత్తున ఉత్పత్తి చేసేందుకు కలిసి పనిచేశాడు. అలెగ్జాండర్ పరిష్కరించిన పజిల్ 'గార్డియన్ నాట్' పేర గానీ, అంతుబట్టని 'ఇంకా గోల్డ్' పేరిట గానీ ఆ క్యూబుల్ని ఉత్పత్తి చేద్దామనుకున్నారు తొలుత. అయితే, 1980లో రూబిక్స్ క్యూబ్‌గా తన సృష్టికర్త పేరుని సార్థకం చేస్తూ ఐడియల్ టాయ్ కార్ప్స్ ద్వారా ప్రపంచాన్ని చుట్టేసింది. లండన్, న్యూయార్క్, పారిస్, న్యూరెమ్‌బర్గ్ టాయ్ ఫెయిర్‌లలో పరిచయమై అదే ఒక ప్రపంచాన్ని సృష్టించుకుంది. అది పుట్టి నలభై ఏళ్లు దాటిపోయింది. సుమారు 40 కోట్ల మందిని చేరింది. జీవితాంతం దాని టెక్నిక్ పట్టే పనిలో తాతయ్యలైన వారున్నారు. క్షణాల్లో రంగుల్ని చేర్చి రికార్డులు బద్దలు కొడుతున్న స్పీడ్ క్యూబర్లున్నారు. ఏడాదికేడాది లక్షల మంది పుట్టుకొస్తున్న ఆ క్యూబికల్ లోకం గుట్టు చెప్పేందుకు, పట్టు సాధించేందుకు దాని సృష్టికర్త ఎర్నో ర్యూబిక్ 'బియాండ్ క్యూబ్' పేరిట ప్రపంచ పర్యటన ప్రారంభించాడు. 40 యేళ్లు పూర్తయిన సందర్భంగా గూగుల్ లిబర్టీ మ్యూజియంతో కలిసి ఓ ప్రాజెక్ట్‌నే మొదలెట్టింది. న్యూజెర్సీలో మ్యూజియమే ఏర్పాటు అవుతోంది. 35 అడుగుల ఎత్తున్న ఓ భారీ రూబిక్స్ క్యూబ్, 17 కోట్ల రూపాయల పైనే విలువ చేసే వజ్రాల క్యూబ్, రోబోల ఆటలో పడిన క్యూబ్‌లతో ప్రదర్శన ఏర్పాటవుతోంది. భారీ క్యూబ్‌ను ఎల్ఈడీ లైట్లతో సెల్‌ఫోన్ ద్వారానే ఆడుకోవచ్చు. డైమండ్ క్యూబ్‌ను 1995లో ఫ్రెడ్ కుల్లర్స్ డైమండ్ కట్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ రూపొందించింది. 18 కేరట్ల బంగారంలో 22.5 కేరట్ల నీలవేణులు, 34 కేరట్ల కెంపులు (మాణిక్యాలు), 34 కేరట్ల మరకతాలు (పచ్చలు) పొదిగి దీన్ని రూపొందించారు.

అంతా డిటైల్స్‌లోనే..

రూబిక్స్ క్యూబ్ ఏదో సరదాకు ఆడే ఆటే అనుకుంటే పొరపాటే. ఈ పజిల్ పరిష్కరించడానికి చాలా విషయాల్ని గుర్తుంచుకోవాలి. స్పేషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావితమవుతుందని పరిశోధకులు చెబుతున్నారు. స్త్రీల కంటే పురుషులకే జన్యుపరంగా స్పేషియల్ ఇంటెలిజెన్స్ ఎక్కువగా ఉంటుందంట. కొందరికి తేదీలు అంతగా గుర్తుండవు. కానీ, చాన్నాళ్ల కింద చూసిన ముఖాన్ని ఇట్టే గుర్తుపట్టేస్తారు. ఎపుడో వెళ్లిన బంధువు ఇంటికి చిరునామా తేలిగ్గా పట్టేస్తారు. ఇంటి అమరికలో ఏదన్నా తేడా ఉన్నట్టయితే ఈ వస్తువు ఇక్కడుండేమిటి అంటూ చిన్న చిన్న విషయాల తేడాను ఇట్టే గుర్తిస్తారు. దీనికి కారణం స్పేషియల్ ఇంటెలిజెన్సే. 3డి కదలికల గుర్తింపు, ఘటనల్ని చిన్న చిన్న క్లిప్పింగ్‌లుగా గుర్తించుకునే ఫొటోగ్రాఫిక్ మెమొరీ, విభిన్న తీరులను గుర్తించడం వంటివి ప్రధానమైనవి. వస్తువులను సృష్టించే కళాకారులకు దీనితోనే పని ఎక్కువ. చాలా చిన్న చిన్న అంశాల్లో ఉన్న తేడాలతోనే వారు అద్భుతాలను మలుస్తారు. పెయింటర్లు బ్రష్ స్ట్రోక్‌ల్లోని మర్మాన్ని, రంగుల కలపడంలోని మార్మికతను వంటబట్టించుకునేది ఇలానే. చిన్న చిన్న వైరుధ్యాల ద్వారానే 3డి ఎఫెక్ట్‌ను తీసుకురాగలుగుతారు. ఆర్కిటెక్ట్‌లకు ఇదే ప్రధానమైంది. కుమ్మరి వారు, శిల్పాలు చెక్కేవారికి ఈ స్పేషియల్ ఇంటెలిజెన్సే గొప్ప ప్లస్. సరిగ్గా దీనిపైనే ప్రభావం చూపిస్తుంది రూబిక్స్ క్యూబ్. రంగుల అమరిక, తద్వారా క్యూబీస్ ఏర్పరిచే చిత్రాలను, తద్వారా మారే రూపాల్ని గుర్తించుకోగలుగుతారు క్యూబర్లు. అలానే వారు స్టెప్పుల రూపంలో విషయాల్ని గుర్తించుకుని చకచకా క్యూబ్‌ను తిప్పుతూ రంగుల అమరిక పూర్తిచేస్తారు. స్పీడ్ క్యూబింగ్‌లో అయితే క్యూబర్ల వేళ్లు, మణికట్టు వద్ద మజిల్ మెమొరీ కీలక పాత్ర వహిస్తుంది. కళ్లు కూడా గమనించనంత వేగంగా వారు క్యూబ్‌ను కదులుస్తూ పరిష్కరించగలుగుతారు. చాలా ప్రాక్టీస్ తర్వాతే ఇలా క్షణాల్లో క్యూబ్‌ను పరిష్కరించగలిగే మజిల్ మెమొరీ వృద్ధి చెందుతుంది. మైండ్ మ్యాపింగ్, ఔట్‌లైన్లను

క్రాస్ పడితే చాలు

ఎన్ని మలుపులు తిప్పినా రూబిక్స్ కథకు క్లైమాక్స్ తెరపడటం లేదా. క్యూబ్‌ను తిప్పి తిప్పి కళ్లు తిరుగుతున్నాయా. రూబిక్స్ క్యూబ్ ఎలా పడితే అలా తిప్పేస్తే పూర్తవదు మరి. ఆల్గారిథమ్‌లతో పట్టు చిక్కించుకుని స్టెప్పుల సీక్వెన్స్‌లను గుర్తుపెట్టుకోగలిగితేనే తేలిగ్గా మూవ్ అవుతారు. గణిత శాస్త్రంలోని గ్రూప్ థియరీ, కమ్యూటేటర్ స్ట్రక్చర్, కాంజుగేట్ స్ట్రక్చర్ కిటుకలతో సెటప్ మూవ్‌లను కదిలిస్తే తేలిగ్గా పూర్తిచేయొచ్చు. ఇదంతా ఇబ్బందిగా అనిపిస్తోందా. మరేం ఫర్లేదు. ప్రతి మూవ్‌ను తేలిగ్గా వివరిస్తూ కేవలం 45 నిమిషాల్లో నేర్చుకునేలా రూబిక్స్.కామ్ వెబ్‌సైట్లో చిట్కాలను నిర్వాహకులు పొందుపరిచారు. దీన్ని చక్కగా నేర్చుకుంటే రెండే నిమిషాల్లో మీరూ క్యూబును పరిష్కరించేయొచ్చు. ఏమో రికార్డులు బద్దలుకొట్టొచ్చు కూడా. రూబిక్స్ క్యూబ్ పజిల్‌ను వివరిస్తూ 40 వేలకు పైగా వీడియోలు యూట్యూబ్‌లో ఉన్నాయి. వాటిని చూస్తూ కూడా ఎంచక్కా నేర్చేసుకోవచ్చు. ఇవన్నీ 'బిగ్ ఫోర్'గా పిలిచే ప్రత్యేక మూవ్ పద్ధతులపైనే ఎక్కువగా ఆధారపడినవే. సీఫాప్, రౌక్స్, జెడ్‌జెడ్, పెట్రస్ పద్ధతులే వాటి పేర్లు. క్యూబ్ మార్కెట్లోకి వచ్చిన ఏడాదికే ప్యాట్రిక్ బొస్సెర్ట్ అనే 12 ఏళ్ల బుడతడు 'యు కెన్ డూ ది క్యూబ్' పేరిట ఓ పుస్తకాన్ని రాశాడు. అందులోని కిటుకును వంటబట్టించు కునేందుకు లక్షల సంఖ్యలో ప్రతులు హాట్ కేకుల్లా అమ్ముడుబోయాయి. జెస్సికా ఫ్రిడెరిక్ కనిపెట్టిన స్పీడ్ క్యూబర్ పరిష్కారాన్నే చాలామంది వాడుతున్నారు. వైట్ క్రాస్‌ను తొలుత పూర్తి చేసి తర్వాత మొదటి రెండు లైన్లు, ఆ తర్వాత చివరి దాన్ని పరిష్కరించే పద్ధతిలో 120 ఆల్గాల్‌లు, 55 మూవ్‌లు ఉంటాయి. వైట్ క్రాస్ చిక్కితే చాలు, మిగతాదల్లా చాలా తేలిక. అన్ని ఆల్గాల్‌లు గుర్తుపెట్టుకోలేని వారికి రెండే ఆల్గాల్‌లతో 65 మూవ్‌ల్లో క్యూబ్‌ను పూర్తిచేసే పద్ధతిని ఫిలిప్ మార్షల్ 'ది అల్టిమేట్ సొల్యూషన్ టు రూబిక్స్ క్యూబ్'లో వివరించాడు. అదీ కష్టమనుకుంటే డెన్నీ డెడ్‌మోర్ చక్కగా చిత్రాల గుర్తులతో, వోల్జెన్‌హోమ్ పేర్లతో గుర్తుపెట్టుకునేలా పద్ధతుల్ని కనుగొన్నారు. ఒక్కసారి అర్థమైతే ఇక మీరు ఆలోచించేదల్లా ఇంతకు క్రితం కన్నా త్వరగా ఎంత పూర్తి చేస్తామనే విషయమే.

క్యూబ్‌లో బిగ్‌బ్యాంగ్

హంగేరియన్ హారర్‌గా ముద్దు పేరున్న రూబిక్ క్యూబ్‌లో ఆరు తలాలు ఉంటాయి. క్యూబ్లెట్లు, క్యూబీలుగా పిలిచే 26 చిన్న క్యూబులు ఒకదానితో ఒకటి ఇంటర్‌లాక్ అయి ఉంటాయి. ఆరు తలాలు నారింజ, ఎరుపు, తెలుపు, పచ్చ, నీలం, పసుపు రంగుల్లో ఉంటాయి. ఒక్కో తలంలో 9 క్యూబులు అమరి ఉంటాయి. ఈ మొత్తం క్యూబ్ భాగాల్ని ఒక్కో తలంగా ముందుకు వెనుకకు తిప్పొచ్చు. వాటిని ముందుకు, వెనుకకు తిప్పుతూ ఒకే రంగు క్యూబీలు ఒకే తలంపై అమరేలా చేయడమే దీనిలోని పజిల్. క్యూబీలను స్క్రాంబ్ల్ చేసిన తర్వాతే ఆట మొదలౌతుంది. ఈ క్యూబీలతో 43 క్వింటిల్లియన్ రకాల కదలికలను చేయొచ్చు. 43 క్వింటిల్లియన్ అంటే 43 తర్వాత 18 సున్నాలను వేసిన తర్వాత వచ్చిన సంఖ్య. చాలా పెద్దది కదా. తేలిగ్గా చెప్పాలంటే 5.7 సెంటీ మీటర్లుండే దాని కదలికల్ని భూమి మీద పేర్చుకుంటూ పోతే 275 సార్లు భూమిని కప్పేయొచ్చు. ఇంకా చెప్పాలంటే బిగ్ బ్యాంగ్ నుంచి మొదలెడితే ఇప్పటికీ వాటి రకరకాల మూవ్‌లు వేయొచ్చు. ఇంత సంఖ్యలో రంగులు సరిగా అమరేది ఒక్కసారే అంటే ఆశ్చర్యం కలిగిస్తోంది కదూ. ఇదే ప్రపంచంలో అత్యధికంగా అమ్ముడుబోయిన బొమ్మ. టాయ్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కించుకున్న పజిల్.

గుర్తించుకోవడం ద్వారా కూడా వారి పని తేలికవుతుంది. రూబిక్స్ క్యూబ్‌తో మరో మేలు ఏమిటంటే యాబ్‌స్ట్రాక్ట్, అనలిటికల్ ఎబిలిటీస్ కూడా పెంపొందుతాయట. రీజనింగ్ వంటి అంశాల్లో వీటిదే కీలకపాత్ర.

క్షణాల్లో రికార్డులు..

వరల్డ్ క్యూబ్ అసోసియేషన్ (డబ్ల్యుసీఏ) పేరిట క్యూబర్లంతా ఓ వేదికను ఏర్పాటు చేసుకుని ప్రపంచవ్యాప్తంగా పోటీలను నిర్వహిస్తున్నారు. కళ్లకు గంతలు కట్టుకుని, ఒంటి చేత్తో క్యూబ్‌ను తిప్పుతూ, పాదాలతో కదుపుతూ, నీటిలో మునిగి ఒక్క శ్వాసలో వీలైనన్ని క్యూబులను పరిష్కరించడం, అతి తక్కువ కదలికల్లో పూర్తిచేయడం వంటి అంశాల్లో పోటీలను అధికారికంగా నిర్వహిస్తున్నారు. స్పీడ్ క్యూబింగ్ కూడా బాగా ప్రాచుర్యంలో తెచ్చారు. అయితే వీరికి ముందే గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు 1981లో మ్యూనిచ్‌లో స్పీడ్ క్యూబింగ్ పోటీలను నిర్వహించారు. జూరీ ఫ్రాయెస్కీ అనే విద్యార్థి 38 సెకన్లలో క్యూబ్‌ను పరిష్కరించి తొలి రికార్డు నెలకొల్పాడు. ఆ తర్వాతి ఏడాదిలో బుడా పెస్ట్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో మిన్హ్ థాయి అనే వియత్నాం విద్యార్థి 22.95 సెకన్లలో పూర్తిచేసి ఆ రికార్డును బద్దలుకొట్టాడు. అప్పటి వరకు రూబిక్స్ క్యూబంటే గంటల సమయం పట్టే వ్యవహారంలా కనిపించేది. క్షణాల్లో క్యూబింగ్ పరిష్కరించేస్తున్న వారిని చూసి విస్మయం వ్యక్తంచేసేవారు. ఈ క్షణాల రికార్డులను కచ్చితంగా కొలిచేందుకు స్టాక్ టైమర్‌ను 2004లో డబ్ల్యుసీఏ రూపొందించింది. టచ్ ప్యాడ్లపై అరచేతులను తీశాక సమయం ప్రారంభమై క్యూబ్‌ను పూర్తిచేసి ప్యాడ్లను తాకిన తర్వాత ఆగిపోతుంది. ఇది చాలా కచ్చితంగా పనిచేయడంతో పోటీలంతటా స్టాక్ టైమర్లనే ఉపయోగిస్తున్నారు. ఈ పోటీల్లో రూబిక్స్ క్యూబులు వేగంగా కదిలేందుకు ప్రత్యేకంగా వాటిని తయారు చేస్తున్నారు. వాటికి ల్యూబ్రికెంట్లను కూడా వాడుతున్నారు. రూబిక్స్ క్యూబ్ ఏదో అగాథంలా తోస్తుంది గానీ, వాటిని వేగంగా పూర్తిచేసేవారిని చూస్తే అందరూ పరిష్కరించేయొచ్చు అనే నమ్మకం కలుగుతుంది. చైనాలో మూడేళ్ల పాప రెండే నిమిషాల్లో దీని అంతు చూసిందట. 2010లో ఇంగ్లండ్‌లోని డాక్టర్ చాల్లొనెర్స్ గ్రామర్ పాఠశాల విద్యార్థులు 134 మంది ఒకేసారి 12 నిమిషాల్లో రూబిక్స్ క్యూబ్‌ను పరిష్కరించి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కేశారు.

2012లో మన దేశంలోని పూణె ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు 3248 మంది ఒకేసారి 30 నిమిషాల్లోపు క్యూబ్‌ను పూర్తిచేసి భారీ రికార్డును నెలకొల్పారు. మన దేశానికి చెందిన స్పీడ్ క్యూబ్ స్టార్ ఆకాశ్ రూపేలా 6.91 సెకన్లలో క్యూబ్‌ను పరిష్కరించాడు. అంత తేలికైపోవడంతో రకరకాల విన్యాసాలు చేస్తూ రంగుల్ని సరిచేస్తున్నారు. జగ్లింగ్ చేస్తూ, ఒక చేత్తో దండీలు తీస్తూ మరో చేత్తో క్యూబ్‌ను తిప్పుతూ, ఒకరి చేతిలో ఉన్న క్యూబ్‌ను చూస్తూ తర్వాత మూవ్స్‌ను చెబుతూ, ఒకేసారి రెండు క్యూబ్‌లను పరిష్కరిస్తూ ఇలా వారికి తోచిన విధంగా క్యూబ్ సంగతి చూస్తున్నారు.

ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన డోయెల్స్‌టౌన్ పోటీల్లో కొలిన్ బర్న్స్ అనే కుర్రాడు కేవలం 5.25 క్షణాల్లో రూబిక్స్ క్యూబ్‌ను పరిష్కరించి సరికొత్త రికార్డు సృష్టించాడు. ఇదే ఏడాది మెల్‌బోర్న్ క్యూబ్ డే పోటీల్లో ఫెలిక్స్ జెమ్డెగ్స్ అనే మరో కుర్రాడు ఒంటి చేత్తో 6.54 క్షణాల్లో పరిష్కరించేశాడు. గేబ్రియెలా పెరీరా కంపానా అయితే పాదాలతో 25.14 సెకన్లలో రంగుల అమరికను సరిచేసి ఇచ్చాడు. మార్కిన్ కోవాల్సిజిక్ అనే పోలెండ్ కుర్రాడు కళ్లకు గంతలు కట్టుకుని 21.17 సెకన్లలో క్యూబ్‌ను పూర్తిచేశాడు. బ్లైండ్‌ఫోల్డ్‌లో ఒకసారి రంగుల తారుమారును చూసి గుర్తించుకుని స్టెప్పులు వేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. మనల్ని వెనక్కు నెడుతూ మొబైల్ ఫోన్‌తో పనిచేసే లెగోస్టార్మర్ పరికరం 'క్యూబ్‌స్టార్మర్-3' కేవలం 3.25 సెకన్లలో క్యూబ్‌ను పరిష్కరించేసింది. ఇదో సంచలనం. అన్నీ క్యూబ్‌ల కన్నా క్లిష్టమైన 17*17*17 'వీ క్యూబ్'ను కెన్నెత్ బ్రాండెన్ అనే కుర్రాడు 7.5 గంటల్లో పరిష్కరించి అది అసాధ్యమనుకున్న వారి అంచనాల్ని తారుమారు చేశాడు. 2010లో గూగుల్, రూబిక్స్ సంయుక్తంగా చేసిన కంప్యూటర్ ప్రాజెక్ట్‌లో రూబిక్స్ క్యూబ్‌ను 20 మూవ్స్‌లో పూర్తి చేయొచ్చని తెలిసింది.

దీన్ని 'గాడ్స్ నంబర్' (దేవుని సంఖ్య)గా క్యూబర్లు అభివర్ణిస్తారు. ఇది మానవునికి అసాధ్యమనే అనుకునేవారు. కానీ, 2012లో జపాన్‌కు చెందిన టొమోకీ ఒకయామా అనే విద్యార్థి కేవలం 20 కదలికల్లో క్యూబ్‌ను పరిష్కరించి అందర్నీ అతిశయంలో పడేశాడు. కచ్చితంగా చెప్పాలంటే, క్యూబ్‌ను 17 కదలికల్లోనే పరిష్కరించొచ్చని అంచనా. చూడాలి దీన్ని ఏ క్యూబహాలిక్ పూర్తిచేసేస్తాడో. నిత్యం రూబిక్స్ క్యూబ్‌లో పడి మిగతా విషయాల్ని అశ్రద్ధ చేసేవారిని క్యూబహాలిక్స్‌గానే పిలుస్తున్నారు మరి. వారికి క్యూబ్ ఓ వ్యసనమై వెర్రివాళ్లను చేస్తోందట. తెల్లారి లేచింది మొదలు, నిద్ర మానుకుని మరీ క్యూబ్‌లో ఇరుక్కుంటున్నారట. దీనిపై డాక్యుమెంటరీ కూడా వచ్చేసింది. వీరికి రూబిక్స్ రిస్ట్, క్యూబిస్ట్ థంబ్ అనే మణికట్టు, వేళ్ల సమస్యలు వస్తున్నాయి కూడా.

పోల్కాకు పోటీ

క్యూబహాలికుల చేతులు నొప్పి పెడుతుంటే వీరి పిచ్చేమో ఫోక్ ఆర్టిస్టులకు కావాల్సిన వస్తువైంది. రూబిక్స్ క్యూబ్ రూపంలో ఫర్నీచర్‌ను, ఆర్టికల్స్‌ను రూపొందిస్తున్నారు. పోల్కా డాట్స్‌కు పోటీగా క్యూబ్ రంగుల్లో వస్త్రాలు ఫ్యాషన్ అయ్యాయి. ఇంటీరియర్ డెకరేషన్‌లోను రూబిక్స్ క్యూబ్‌లను ఉపయోగిస్తున్నారు. రూబిక్స్ క్యూబిజమ్ పేరిట సరికొత్త పాయింటిలిస్ట్ ఆర్ట్ కూడా వ్యాపించింది. వివిధ రంగుల్లో రూబిక్స్ క్యూబ్‌లను ఓ చోట పేర్చి వాటి రంగుల వైవిధ్యంతో ఆకృతులను చిత్రించడమే ఈ సరికొత్త ఆర్ట్. క్యూబుల ద్వారా సెలబ్రెటీల ముఖ చిత్రాలను రూపొందించడం ఇప్పుడో ట్రెండ్. మార్లిన్ మన్రో, మార్టిన్ లూథర్ కింగ్, మన రజనీ కాంత్ వరకు ఇలా రంగుల క్యూబుల్లో ఒదిగిపోయినవారే. 2011లో జోష్ చాలోమ్ అనే ఆర్టిస్ట్ 29 మంది క్యూబర్ల సాయంతో క్యూబ్ ఆర్ట్స్ పేరిట ఇలాంటి 40 ఆర్ట్ వర్కులతో టొరొంటో కలెక్టివ్స్‌ను రూపొందించాడు. ప్రపంచ ప్రసిద్ధ సిస్టీన్ చాపెల్‌ను 2.5 లక్షల క్యూబ్‌లతో చిత్రించాలనేది ఆయన తర్వాతి ప్రాజెక్ట్. 2010లో పీటె ఫెక్యూ అనే ఆర్టిస్ట్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌ను సంస్మరించుకుంటూ 4,242 క్యూబ్‌లతో ఆయన ముఖ చిత్రాన్ని

బోలెడు క్యూబ్‌లు

రూబిక్స్ క్యూబ్ పజిల్‌కు ముందు 1970లో ల్యారీ నికోలస్ అనే శాస్త్ర నిపుణుడు అయస్కాంతాలతో అమరిన 2ఇ2ఇ2 పజిల్‌ను రూపొందించాడు. అదే ఏడాది ఫ్రాంక్ ఫాక్స్ అనే శాస్త్రవేత్త 3ఇ3ఇ3 గోళాన్ని సృష్టించాడు. కానీ అవి అంతగా ప్రాచుర్యం పొందలేదు. ర్యూబిక్ క్యూబ్ ప్రేరణతో మరిన్ని రూపాల్లోకి మారి 2003లో గ్రీక్ శాస్త్రవేత్త పానాగియోటిస్ వెర్డెస్ 'వీ క్యూబ్' అనే 11*11*11 క్యూబ్ వరకు రూపొందింది. 2011లో ఆస్కార్ వాన్ డివెంటర్ రూపొందించిన 17*17*17 వీ క్యూబ్ ఇపుడు అందుబాటులో ఉంది. పెద్ద పజిలైన దీని ధర 65 వేల రూపాయల వరకు ఉంది. థిసిల్‌వైటె, కోసింబా వంటి కంప్యూటర్ జనరేటెడ్ పజిల్స్ 100*100*100 పరిధి దాటి 1000*1000* 1000 వరకు సాగిపోయింది. 4డి, 5డి పజిళ్లు కూడా నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. పైరామింక్స్, గిగామింక్స్, స్క్యూబ్ డైమెండ్, మెగామింక్స్, డోగిక్, రూబిక్స్ స్నేక్, స్క్వేర్ వన్, బెవెల్ క్లబ్, సూపర్ ఎక్స్, టోరు, రువా వంటి ఎన్నో రూబిక్స్ క్యూబ్ తరహా వివిధ రూపాల్లోని పజిల్స్ మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. చేత్తో తిప్పాల్సిన అవసరం లేకుండా రూబిక్స్ టచ్ క్యూబ్ కూడా 2009లోనే వచ్చేసింది. కేవలం అవి ఏ దిశలో తిరగాలో అలా వేలితో టచ్ చేస్తే చాలు ఆ అమరికలో ఆటోమేటిగ్గా రంగులు మారిపోతాయి. పజిల్ జటిలమౌతుంటే హింట్స్ ద్వారా తర్వాతి స్టెప్‌లను వివరిస్తుందిది. దానికదే పజిల్ పరిష్కరించుకునేలా కూడా దీన్ని రూపొంది ంచారు. అప్పుడప్పుడే రూబిక్స్ క్యూబ్ నేర్చుకునే వారికి ఇది బాగా ఉపయోగ పడుతోంది. అంధులకు, మెంటల్లీ చాలెంజ్‌డ్ పిల్లలకు కూడా రూబిక్స్ క్యూబ్‌లను తయారు చేశారు.



చిత్రించాడు. క్యూబ్‌ను కళాఖండాలుగా మార్చినవారూ ఉన్నారు. న్యూయార్క్‌లో కదల్చగలిగే భారీ క్యూబ్‌ను ఏర్పాటు చేశాడు టోనీ రోసెంథాల్. దాన్ని 'ది ఆస్టర్ క్యూబ్', 'అలామో' అని పిలుస్తున్నారు. సియాటెల్‌లో 2009లో బర్నింగ్‌మేన్ సంస్థ నిర్మించిన 30 అడుగుల గ్రావిక్స్ క్యూబ్ ప్రపంచంలోనే అతిపెద్దదిగా గుర్తించారు. మిచిగాన్, టెన్నెసీల్లో కూడా భారీ క్యూబ్‌లున్నాయి. డిస్నీ పాప్ కల్చర్ రిసార్ట్‌లో అయితే ఏకంగా మెట్లదారిని కలిగిన క్యూబ్‌లున్నాయి. యూగిని గ్రిగొరీవ్ కేవలం 10 మిల్లీమీటర్ల సైజులో బుల్లి రూబిక్స్ క్యూబ్‌ను రూపొందించాడు. దాన్ని తిప్పొచ్చు కూడా. క్యూబ్‌ను మేధస్సుకు సింబాలిక్‌గా వాడుతూ అనేక చిత్రాల్లో సన్నివేశాలున్నాయి. 'వాల్ ఈ' లాంటి హాలీవుడ్ యానిమేటెడ్ సినిమా నుంచి మన 'జులాయి' వరకు రూబిక్స్ క్యూబ్‌లు తెలివితేటలకు గుర్తుగా కనిపిస్తాయి. 'వన్' సినిమాలో హీరోకు తన తండ్రి అందించిన క్యూబ్ పజిల్‌లోనే కథ ప్రధానాంశం ఉంటుంది.

సెలబ్రెటీల్లోను క్యూబర్లున్నారు. హాలీవుడ్ స్టార్ విల్‌స్మిత్, మన ఆమీర్ ఖాన్ టీవీ షోల్లో క్యూబ్‌లను పరిష్కరించి అభిమానులను ఆకట్టుకున్నారు. ఇంతమందిని తన చుట్టూ తిప్పుకుంటున్న రూబిక్స్ క్యూబ్ ప్రతిష్ఠ శాశ్వతంగా నిలిచిపోయేలా 'టాయ్స్ హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటుదక్కడానికి వెనుక ఉన్నది ఎవరో తెలుసా. దాన్ని ఎంతో ఇష్టపడే చిన్నారులు. న్యూయార్క్‌లోని రోచెస్టర్‌లో ఉన్న నార్త్‌వుడ్ ఎలిమెంటరీ పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థులు. వారి చేసిన విన్నపానికి తోడు స్వచ్ఛందంగా వచ్చిన మరో వేయి నామినేషన్లతో 'హాల్ ఆఫ్ ఫేమ్' నిర్వాహకులు 2014లో దానిని అద్భుత సృష్టిగా గుర్తిస్తూ చోటు కల్పించారు. నైపుణ్యం, బోధన, ఆట, ఆవిష్కరణ అంశాల్లో అది ఎంతో ఉన్నతమైన ఆటవస్తువుగా ప్రకటించారు. దాని సృష్టికర్త లక్ష్యం కూడా అదే. "ఆసక్తితో ప్రపంచాన్ని గమనిస్తే, మీ చుట్టుతా ఎన్నో పజిల్స్ కనిపిస్తాయి. మీరు కనుక నిశ్చయించుకుంటే వాటిని పరిష్కరించగలరు." అనేది ఎర్నో రూబిక్ మాట. రూబిక్స్ క్యూబ్ పజిల్‌తో పాటు జీవితమనే పజిల్ చిక్కుముడిని విప్పే ప్రయత్నాన్ని ఇష్టపడి, తెలివిగా చేస్తే తేలిగ్గా పరిష్కారమైపోతుందనేది ఆ మాట వెనుక ఉన్న ఫిలాసఫీ. 43 క్వింటిల్లియన్ మూవ్స్‌లోకి మనల్ని తోసేసే క్యూబ్ పజిల్‌ను కేవలం 20 మూవ్స్‌లో అంతుచూడగా లేనిది, జీవితంలోని చిక్కుముళ్లని పరిష్కరించుకోగలమా లేదా అనేది ఆలోచించాల్సిందే.

జేఎస్పీ

9502395077

మేడిపండు

-పి. సత్యనారాయణ
9848088775.

◆ కథ

"అబ్బాయి మహేష్ నుంచి వారమైంది ఫోన్ వచ్చి" అనుకుంది సుజాత. తను మాత్రమే ఇలా ఉందా, లోకంలో తల్లులందరూ ఇంతేనా. సుజాత ఆలోచనలను భగ్నంచేస్తూ వీధి తలుపు చప్పుడైంది. ఆమెలేచి తలుపు తీసి, ఎదురుగా నిల్చున్న భర్తతో "ఆలస్యమైందేమిటి" అంది. "రామారావు స్కూలు మూసేశాక మన ప్రెసిడెంటుగారి దగ్గరకు వెళ్ళి వచ్చాను" అన్నాడు.

సుజాత ప్రశ్నార్థకంగా చూసింది. రామారావు "మహేష్ చేత చిన్న ఇండస్ట్రీ పెట్టిద్దామనుకుంటున్నాం కదా. వివరాలు మాట్లాడదామని వెళ్ళాను" అన్నాడు.

"ఇండస్ట్రీ పెట్టించాలని మీరనుకుంటున్నారు. పెట్టాలని వాడను కుంటున్నాడా?"

"అదేంమాట? ఆ ఉద్దేశంతోనే కదా ఇంజనీరింగ్‌లో మెకానికల్ బ్రాంచ్ తీసుకోమని చెప్పాను. అందరూ కంప్యూటర్ ఇంజనీరింగ్ వైపు పరుగులు తీసేవారే. కాలేజి ఎలాంటిదైనా ఫర్వాలేదు. కంప్యూటర్సే చదవాలి. మనవాడలా కాకుండా మంచి కాలేజిలో చదువుతున్నాడు. మన ఊళ్ళోనే ఫ్యాక్టరీ పెడితే పదిమందికి పని కల్పించినవాడవుతాడు".

"అప్పుడప్పుడు అందరిలా కంప్యూటర్ ఇంజనీరింగ్ చదవడం లేదనుకుంటూ ఉంటాడు"

"చిన్నపిల్లాడు. వాడికేం తెలుస్తుంది. నాలుగేళ్ళయ్యాక వాడికే మంచీ చెడూ తెలిసి వస్తాయి. అన్నట్లు ఈ మధ్య ఫోనేమీ చెయ్యలేదెందుకో" అంటూండగానే మహేష్ నుంచి ఫోను వచ్చింది. కాల్ రిసీవ్ చేసుకున్నాడు. "హలో మహేష్ ఏమిటి సంగతులు?"

"క్యాంపస్ ఇంటర్వ్యూలు అవుతున్నాయి. అందుకే చెయ్యలేకపోయాను. నాకు ఉద్యోగం వచ్చింది".

"ఉద్యోగమా? ఎక్కడ వచ్చింది? వివరంగా చెప్పు"

"చాలామంచి ఉద్యోగం. నెలకు యాభైవేల జీతం. ఈ ఆదివారం ఇంటికొచ్చినప్పుడు అన్నీ చెప్తాను". మహేష్ ఫోన్ పెట్టేశాడు. రామారావు మాట్లాడకుండా కూచున్నాడు. సుజాత భర్తను పలకరించే ధైర్యం చెయ్యలేకపోయింది.

❍ ❍ ❍

మహేష్ ఆదివారం ప్రొద్దుటే వచ్చాడు. స్నానం చేసి టిఫిన్ తిన్నాక తండ్రి, కొడుకులిద్దరూ మాట్లాడుకోవడం మొదలెట్టారు. సుజాత అక్కడే కూచుని కూరలు తరుగుతోంది.

"చెప్పు మహేష్ ఉద్యోగం వచ్చిందనీ, యాభైవేల జీతమనీ చెప్పావు. అంతకన్నా ఏం చెప్పలేదు. ఏమిటి జాబ్? "

" సాఫ్ట్‌వేర్ ఇంజనీర్"

"అదేమిటి, నువ్వు మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్నావు కదా"

"నిజమే. కానీ కొన్ని స్పెషల్ కోర్సులు కూడా చేశాను. అందుకే సెలక్షన్ వచ్చింది."

"నువ్వు చేరడానికి ఒప్పేసుకోలేదు కదా"

మహేష్ ఆశ్చర్యంగా చూసి "అదేమిటి అలా అంటున్నారు? ఇంతకన్నా మంచి ఉద్యోగం నాకు దొరుకుతుందా?" అన్నాడు.

"ఉద్యోగం మంచిదా కాదా అని నేను ఆలోచించడం లేదు. నీ చదువయ్యాక నువ్వు మన ఊళ్ళోనే ఇండస్ట్రీ పెట్టాలనుకున్నాను. అందుకే మెకానికల్ బ్రాంచి చదవమన్నాను."

"ఈ ఊళ్ళోనా? ఈ చిన్న చోట ఏ ఫ్యాక్టరీ పెడతాం? ఏం తయారుచేస్తాం? ఎక్కడకి పట్టికెళ్ళి అమ్ముతాం?"

"ఈ ఊళ్ళోనే పుట్టి పెరిగావు. ఇక్కడ కష్టసుఖాలూ, లాభనష్టాలూ తెలియవా? మన

రైతులందరూ ఎక్కువగా టొమాటో పండిస్తున్నారు. ఒక్కొక్కసారి లాభం వస్తుంది. ఒక్కొక్కసారి టొమాటోలు రోడ్డు మీదనే పారపొయ్యాల్సి వస్తుంది. మనకున్న రెండెకరాలలోనూ అదే పండిస్తున్నాం. నాకు ఉద్యోగముంది కాబట్టి నెలకింత అని జీతమొస్తోంది కాబట్టి తిండికీ, బట్టకీ, నీ చదువుకీ ఇబ్బంది లేకుండా ఉంది".

"ఇదంతా మళ్ళీ ఎందుకు చెప్తున్నారో తెలియడంలేదు. మీరు రిటైర్ అయినా ఏ ఇబ్బందీ ఉండదు. నెలకి యాభైవేలు నాకు వస్తాయి. మిమ్మల్ని ఏ ఇబ్బందీ లేకుండా నేను చూసుకుంటాను"

"నా ఒక్కడి విషయం కాదు. మన ఊరి గురించి ఆలోచించు. నువ్విక్కడ టొమాటోలతో పల్ప్ కానీ సాస్ కానీ చేసే ఫ్యాక్టరీ పెడితే బాగుంటుందని నాకుంది. రైతుకీ నష్ట భయముండదు. పదిమందికి ఉపాధి. నీకు సొంత ఇండస్ట్రీని పెంచి పెద్దదిగా చేసుకునే తృప్తి."

"ఇక్కడా, ఈ ఊళ్ళోనా?"

"అవునిక్కడే, ఇది నీ సొంతూరు" రామారావు గొంతుక పెద్దదయింది.

సుజాత కల్పించుకుని "ఇప్పటికిప్పుడు వాడు మాత్రం ఏం చెప్తాడు? పరీక్షలయ్యేసరికి ఆలోచించుకోవచ్చు. ఇంకా మూడు నెలలుందిగా" అంది.

ఆరోజు సాయంత్రం రామారావు బయటకు వెళ్ళిన సమయంలో మహేష్ తల్లితో అది కాదమ్మా. నాన్న ఈ ఊళ్ళో ఫ్యాక్టరీ అంటారేమిటి? మనకే కరెంటు సరిగ్గా రావడం లేదు. ఒకవేళ సప్లై ఉన్నా మిషన్ల మధ్య పని. హాయిగా ఎ.సి. రూంలో కంప్యూటర్ ముందు కూచుంటే నెల తిరిగే సరికి యాభైవేల రూపాయలు చేతిలో పడతాయి. అందరం సుఖంగా బతకవచ్చు" అన్నాడు.

సుజాత అటూ ఇటూ కాకుండా "సరేలే, ఇంకా టైముందిగా ఆలోచించేందుకు" అంది.

మహేష్ ఆలోచించుకోలేదు. తన ఫ్రెండ్స్ అందరిలాగానే తనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరేందుకే నిర్ణయించుకున్నాడు.

❍ ❍ ❍

ఏడాది గడిచింది. మహేష్ బలవంతపెట్టగా, పెట్టగా సుజాతా, రామారావులు అతను పనిచేసే సిటీకి వచ్చారు. వాళ్ళను రిసీవ్ చేసుకునేందుకు కారులో స్టేషనుకి వచ్చాడు మహేష్.

"కారెప్పుడు కొన్నావు?" సంబరంగా అడిగింది సుజాత.

"రెండు నెలలయిందమ్మా. మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేద్దామని ఇంతవరకూ చెప్పలేదు."

లిఫ్టులో పైకి వెళ్ళాక "ఇదే మనముండే ఫ్లాట్. నేనూ, నా కొలీగ్ కల్సి ఉంటున్నాం. డబుల్ బెడ్రూం, హాల్, కిచెన్. ఇద్దరమూ వంట చేసుకోం. కిచెన్ కాఫీ పెట్టుకుందుకే". అంటూ తలుపు తీశాడు.

మార్బుల్ ఫ్లోర్‌తో, ట్రాన్స్పరెంట్ గాజు కిటికీలతో, సిఎఫ్ఎల్ లాంప్స్‌తో ఇల్లు అందంగా ఉంది.

"అద్దె ఎంత?" అడిగాడు రామారావు

"ఇరవై వేలు"

"అమ్మ బాబోయ్" అంది సుజాత.

"ఇద్దరం చెరిసగం పెట్టుకుంటాంగా. యాభైవేలలో అయిదోవంతేకదా. మన ఊళ్ళో మాత్రం ఆ మాత్రం ఇవ్వకుండా ఇల్లొస్తుందా?"

సిటీలోని మాల్స్, థియేటర్స్, మ్యూజియమ్స్, పార్క్స్ అన్నీ చూపించి రైలెక్కిస్తూ మహేష్ "చూశారా నాన్నా ఇక్కడ లైఫ్ ఎలా ఉందో. గ్లోబలైజేషన్ తర్వాత మన దేశంలోనూ అన్ని సౌకర్యాలూ అమర్చుకోవచ్చు. అన్ని వస్తువులూ కొనుక్కోవచ్చు. ప్రపంచమే కుగ్రామంగా మారిపోయాక ఒక్క గ్రామం గురించి ఆలోచిస్తూండడం విశాల దృక్పథం కాదు" అన్నాడు.

రామారావు ఏమీ మాట్లాడలేదు.

❍ ❍ ❍

ఆరు నెలల తర్వాత మహేష్ తల్లితండ్రులను చూడ్డానికి స్వయంగా కారు నడుపుకుంటూ వచ్చాడు.

"ఓసారి సురేష్ మాస్టార్ని చూసిరా, నీ చదువు విషయంలో ఆయనెంతో శ్రద్ధ తీసుకున్నారు. మ్యాథమాటిక్స్‌కి ట్యూషన్ పెట్టించడం నా జీతంలో అయ్యే పనికాదు". అన్నాడు రామారావు.

మహేష్ తన లెక్కల మాస్టారింటికి వెళ్ళి, పళ్ళ బుట్టను ఆయన దగ్గరపెట్టి నమస్కరించాడు.

"రావోయ్ మహేష్‌రా, ఎలా ఉంది ఉద్యోగం, ఏమిటి విశేషాలు?"

మహేష్ తన ఉద్యోగ వివరాలు చెప్పి "అంతా మీ చలవే సార్" అన్నాడు.

"నేను చేసిందేముంది? నువ్వు తెలివైన కుర్రాడివి. బాగా చదువుకున్నావు. సిటీలో ఉన్నన్ని సదుపాయాలూ, అవకాశాలూ పల్లెటూళ్ళలో లేవు. అందుకే స్టూడెంట్స్‌కి నా వీలైన సాయం చేస్తానంతే"

"సిటీలో కార్పొరేట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉండుంటే లక్షలు గడించే వారు సార్"

"డబ్బే సర్వస్వంకాదు. నలుగురికి ఉపయోగ పడాలన్నదే నా ఆశ. అమ్మాయ్ రేఖా! కొంచెం కాఫీ తేమ్మా"

"అబ్బే ఎందుకు సార్" అని మహేష్ అంటూం డగానే రేఖ లోపల నుంచి కాఫీ తెచ్చి ఇచ్చింది.

"మా అమ్మాయి రేఖ గుర్తుందిగా. రేఖా ఇతను మహేష్. రామారావు మాస్టారి అబ్బాయి. మర్చి పోయావా" లేదన్నట్లు తల ఊపి రేఖ లోపలకు వెళ్ళిపోయింది.

❍ ❍ ❍

రాత్రి భోజనాల దగ్గర రామారావు కొడుకు పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. సుజాత కూడా "అవున్రా అబ్బాయ్. చదువు పూర్తయింది. మంచి ఉద్యోగ మొచ్చింది. నువ్వో ఇంటివాడివయితే మాకు నిశ్చింత". అంది.

"ఇప్పుడే పెళ్ళికి తొందరేముందమ్మా".

"అది కాదు మహేష్. ఈ రోజు వెళ్ళినప్పుడు సురేష్ మాస్టారింట్లో వాళ్ళమ్మాయి రేఖను చూశావుగా. ఆ పిల్లయితే బాగుంటుందను కుంటున్నాం" అన్నాడు రామారావు.

"కృతజ్ఞతా భావమా?" ఎన్నడూ లేనిది మహేష్ కొంత కటువుగా అడిగినట్లనిపించింది అతని తల్లితండ్రులకి.

"అదేం మాట మహేష్ అలా అంటున్నావు? ఆ కుటుంబం చాలా మంచిది. రేఖ వినయం, వందనం ఉన్న పిల్ల. బాగా చదువుకున్న అమ్మాయి. అంతేకానీ నీకు చదువు చెప్పడానికీ, ఈనాడు సంబంధం కలుపుకోడానికీ లింకు లేదు."

"ఇప్పుడే పెళ్ళి గురించి నేనేం అనుకోడం లేదు. కొంచెం ఆలోచించుకోనివ్వండి" అన్న మహేష్ కొంతసేపయ్యాక తల్లి దగ్గర గునిగాడు." సిటీలో ఒక్క జీతం మీద బతకడం కష్టమమ్మా. రేఖ ఉద్యోగం చెయ్యడం లేదు. ఒకవేళ చేద్దామనుకున్నా పెద్ద జీతం రాదు. కనీసం ముప్ఫై, నలభై వేలయినా అమ్మాయి సంపాదించకపోతే బతకడం కష్టమైపోతుంది. ఏం చెయ్యాలిప్పుడు?"

సుజాత ఏమీ మాట్లాడలేదు, మహేష్ రెట్టించి ఆమెను ఏమీ అడగలేదు.

❍ ❍ ❍

ఆరు నెలల తర్వాత మహేష్ వివాహం అతను కోరుకున్నట్లుగా కొలీగ్ ఉషతో జరిగింది. హనీమూన్ వెళ్ళి వచ్చిన మూడో రోజున అతని బాస్ పిలిచి "నెక్స్ట్ వీక్ నుంచి రాత్రి మూడు గంటల నుంచి పని చెయ్యవలసి ఉంటుంది". అన్నాడు.

మహేష్ కొంత ఆశ్యర్యంగా, కొంత నిరుత్సాహంగా "ఎందుకు" అన్నాడు.

"ప్రస్తుతం ఆస్ట్రేలియన్ కంపెనీకి సంబంధించిన ప్రాజెక్ట్ చెయ్యాలి. అంటే వాళ్ళ టైమింగ్స్‌కి సరిపోయేలా మనం పనిచెయ్యాలి. మీ టీంలో అందరికీ అవే టైమింగ్స్"

రెండు, మూడేళ్ళుగా పనిచేస్తున్నా మహేష్‌లో అమాయకత్వం పూర్తిగా పోలేదేమో. అతను "వాళ్ళే టైమింగ్స్ అడ్జస్ట్ చేసుకోవచ్చుగా. మనకి ఎనిమిది నుంచి అయిదు గంటలంటే వాళ్ళకి ఒంటిగంట నుంచి రాత్రి పది దాకా సుమారుగా కదా. అంత కష్టంకాదు". అన్నాడు.

బాస్ గట్టిగా నవ్వాడు. "డబ్బిచ్చేది వాళ్ళు, పని చేసేది మనం".

❍ ❍ ❍

మహేష్ తన కొత్త టైమింగ్స్ చెప్తే ఉష ఏ మాత్రం కంగారుపడలేదు. "ఇటీజ్ ఆల్‌రైట్. నువ్వు ఉదయం మూడు గంటల నుంచి పన్నెండు గంటలదాకా ఆఫీసులో ఉంటావు. నేను ఈవెనింగ్ అయిదు దాకా ఉంటాను. సాయంత్రమంతా ఇద్దరం ఎంజాయ్ చెయ్యొచ్చు. నో ప్రాబ్లం".

ఉష రియాక్షన్ మహేష్‌కి వింతగా అన్పించింది కానీ ఏమీ మాట్లాడలేదు.

"అసలు ముఖ్యమైన విషయం గురించి మాట్లాడుకోవాలి. మన ఇంటిని ఫర్నిష్ చేసుకోవాలి. డ్రాయింగ్ రూం, డైనింగ్ రూం, రెండు బెడ్రూమ్స్, స్టడీకి ఏవేం కొనాలి ఇప్పుడే ఇంటర్నెట్‌లో చూద్దాం. టివి కూడా పెద్దది కొనాలి. ఫ్రిజ్ ఫైవ్ హండ్రడ్ లీటర్స్‌ది బెటర్".

ఇద్దరూ కూచుని నెట్‌లో వరసగా ఏవేం కొనాలో చూసి సెలెక్ట్ చేసే సరికి అర్ధరాత్రయింది. డబ్బున్నప్పుడు కొనుక్కుందాం అనుకుంటే మల్టీనేషనల్ కంపెనీలు కానీ, క్రెడిట్ కార్డులిచ్చే బ్యాంకులు కానీ ఊరుకోవు. అవి ఊరుకున్నా యువత ఊరుకుంటుందా?

❍ ❍ ❍

కొత్త కాపురం చూడ్డానికి వచ్చిన సుజాత, రామారావులు ఆశ్చర్యపోయారు.

"ఇన్ని వస్తువులు ఒక్కసారే ఎలా కొన్నావు? అవునులే ఇద్దరి జీతాలున్నాయిగా. నెలకో వస్తువు కొన్నా సరిపోతుంది. నేనూ, అమ్మా ఏడాదికొకటిగా నెమ్మది నెమ్మదిగా అమర్చుకున్నాం".

మహేష్ సన్నగా నవ్వాడు. "ఇప్పుడలా దేనికీ ఆగే అవసరం లేనే లేదు నాన్నా. అన్నీ ఒకేసారి కొనెయ్యొచ్చు. ప్రతినెలా అకౌంట్‌లోంచి వాళ్ళకి చెల్లింపు చెయ్యొచ్చు" అన్నాడు.

❍ ❍ ❍

రాత్రి ఎప్పటికీ నిద్రపోకుండా దొర్లుతున్న రామారావుతో సుజాత "ఏమిటి ఆలోచిస్తున్నారు. హాయిగా పడుకునే ప్రయత్నం చెయ్యండి" అంది.

"అది కాదు సుజాతా. మన ఎంత పొదుపుగా బతికాం. ఇప్పుడన్నీ ఒకేసారి కొనేశారు. ఇద్దరూ ఇన్‌కమ్‌టాక్స్ కట్టద్దా, కొంతైనా పొదుపు చెయ్యద్దా"

"వాళ్ళ జమాఖర్చులు మీకెందుకు? పిల్లల్ని కనిపెంచి పెద్దచేశాం. మన బాధ్యత అయిపోయింది"

"సుజాతా! బాధ్యత తీరిపోవడమేమిటి? పిల్లల పట్ల బాధ్యత, చుట్టూ ఉన్న వారి పట్ల బాధ్యత, దేశం పట్ల బాధ్యత ఎప్పటికీ ఉంటాయి. కొన్న వస్తువులని చూడు. అన్నీ విదేశీవే. ఇందుకేనా స్వాతంత్ర్య పోరాటం చేసింది. ఆనాడు ఈస్ట్ ఇండియా కంపెనీ, ఈనాడు మల్టీనేషనల్స్, మన రైతులూ, కార్మికులూ మట్టికొట్టుకు పోవలసినదే."

"ఒకటి, రెండేళ్ళు పోనివ్వండి. పిల్లలు పుడతారు. అప్పుడు నెమ్మదిగా చెప్పరుగానీ".

❍ ❍ ❍

మహేష్ తల్లితండ్రులను రైలెక్కించి ఇంటికొచ్చేసరికి ఉష టివి చూస్తోంది. ఏమిటి విశేషాలంటూ అతను ఆమె పక్కనే కూచున్నాడు. "ఇప్పుడే మా ఫ్రెండ్ ఫోనుచేసి కన్నీళ్ళు పెట్టుకుంది. వాళ్ళ ఆఫీసులో మాస్ స్కేల్లో రిట్రెంచ్‌మెంట్ అవుతోంది. తన ఉద్యోగం కూడా పోయిందట. మళ్ళీ ఎప్పుడు దొరుకుతుందో అని భయపడుతోంది".

"మనకా ప్రాబ్లం లేదులే. నాకు పోయినా నీకుంటుంది. నీకు పోతే నాకుంటుంది."

"అయినా మన బిపి ఓ లో ప్రాజెక్టులు కూడా చాలానే ఉన్నాయి. ఇప్పుడిద్దరినీ సింగపూర్‌కి సంబంధించిన ప్రాజెక్టులోనే వేశారు. కల్సి వెళ్ళి కల్సి వచ్చేస్తున్నాం. ఇద్దరికీ హాయిగా ఉంది."

మర్నాడు 'హాయిగా ఉన్నాం' అన్న మాట ఇద్దరి నోట్లో వచ్చే ఛాన్స్ లేకపోయింది. ఇద్దరి టేబిల్స్ మీద పింక్‌స్లిప్స్ ఉన్నాయి. తలెత్తి చూసేసరికి చాలామంది ముఖాల్లో ఆందోళన. అందరికీ అదే పరిస్థితా?

నెమ్మదిగా కారణం తెలిసింది. ఇండియాలో కన్నా ఫిలిప్పైన్స్‌లో చవగ్గా పని జరిగే సూచనలు కన్పించాయి. ఇండియాలో బిపిఓ మూసేసి ఫిలిప్పైన్స్‌లో తెరుస్తున్నారు. ఎక్కడ చవగ్గా పని చేసేవాళ్ళు దొరికితే అక్కడే పని చేయించుకోడం వ్యాపార విజయ రహస్యం. మరి ఎంప్లాయిల మాట ఏమిటి?

వాళ్ళ గోడు ఎవరికిపడుతుంది? ఇప్పుడేం చెయ్యాలి? అన్ని వస్తువులూ లోన్ చేసికొన్నారు. లోన్ తీర్చకపోతే క్రెడిట్ కార్డ్ కంపెనీలు ఊరుకోవు. మనిషిని చూసి అప్పు ఇచ్చామంటారు. మనిషి రక్తాన్ని జలగలా పీల్చుకుంటారు. ఏం చెయ్యాలి, ఎవరికి తనగోడు పడుతుంది?

మహేష్ ఆలోచనలని భగ్నం చేస్తూ ఫోను మోగింది. తన తండ్రి క్షేమంగా చేరినట్లు చెప్పడానికి చేసినట్లున్నారు.

"నాన్నా, నా ఉద్యోగం పోయింది" ఆ ఒక్క వాక్యం వెనక ఎంతో ఉంది... "నాన్నా, మీరు ఆనాడు చెప్పారు. భూమి తల్లిని నమ్ముకుని బతుకుతున్న రైతులకు ఉపయోగంగా ఏదైనా చెయ్యమన్నారు. చిన్న ఫ్యాక్టరీ పెట్టి పదిమందికి ఉపాధి కల్పించ మన్నారు. అవేవీ నేను పట్టించుకోలేదు. ధనం కోసం వెంపర్లాడాను. నాకు పెద్ద జీతమిస్తున్న వాడు నన్ను మించి డబ్బు కోసం అంగలారుస్తున్నాడని ఇప్పుడే తెలిసింది. కంపెనీకి కావల్సింది లాభం మాత్రమే. ఉద్యోగులను పట్టించుకోదు. ప్రపంచం కుగ్రామమంటున్నారు. కుగ్రామం అంటే చెడ్డవాళ్ళ లాభానికి ఏర్పడ్డ గ్రామం. నన్ను క్షమించండి నాన్నా"

"బాబూ మహేష్, భయపడకు, వర్రీకాకు" రామారావు అన్న ఆ వాక్యం వెనక ఎంతో ఉంది... "మహేష్, తెలియక తప్పుచేశావు. బిపిఓ అంటే మాయామృగమైన బంగారు జింక అని తెల్సుకోలేకపోయావు. నువ్వే కాదు యువతీ యువకుల్లో చాలా మందికి తెలియడం లేదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మెకానికల్ ఇంజనీరింగ్ చదువుకున్నావు. నీ చదువుకి తగిన ఉద్యోగం దొరకడం కష్టం కాదు. ఇంత జీతం ఉండకపోవచ్చు. లేదా నేను సూచించినట్లుగా ఇండస్ట్రీ పెట్టినా సరే, భయపడే పనిలేదు."

తండ్రీ కొడుకుల మధ్య మాటలు సెల్‌టవర్స్ ట్రాన్స్మిట్ చేసి ఉండచ్చుకానీ వారి హృదయ సంవాదాన్ని ఏ వేవ్స్ ట్రాన్స్మిట్ చేశాయో తెలియదు. ఇద్దరి మధ్యా దూరం తరిగి ప్రపంచం ఆర్థికంగా కాకా హార్థికంగా కుగ్రామమైనట్లు వారికి అన్పించింది.

✦

ఆలోచింపచేసే సంచార జీవనం

ఈ పుస్తకానికి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం మానవ శాస్త్ర విభాగం ఆచార్యులు పొన్నాడ వెంకటరావు చక్కటి విలువైన ముందు మాట రాశారు. సంచార జాతులయిన దొమ్మరి, పూసల, గుడ్డెలుగు, బహురూపి, మొండి, బండ, ఎరుకల మొదలయిన వారి జీవన విధానం అంతరించిపోతున్న వారి కళారూపాలు దయనీయమైన వారి దైనందిన పరిస్థితులు ఈ పుస్తకం ప్రథమార్ధంలో చక్కగా తెలిపారు. వారి దుర్భర జీవన సంస్కృతి నిరంతరాయంగా ఒకదానినొకటి ప్రభావితం చేస్తాయి. అని సోదాహరణంగా విశదీకరించిన రచయిత.... జానపదుల సంస్కృతి ఎలా బజారున పడిందో తెలియచేసి సామాన్యుల్ని, ప్రజాస్వామ్యాన్ని భక్షించే రాక్షస భటుల నుండి జానపదుల సంస్కృతిని హిపోక్రాట్ల నుండి కాపాడడం ఎంతో కష్టం అని మనల్ని ఆలోచింపచేస్తారు.

సంచార స్రవంతి

రచన: డా॥వి.ఎస్.వి.కె.శాస్త్రి, వెల: 150/-, పేజీలు: 236, ప్రతులకు: డా॥వి.ఎస్.వి.కె.శాస్త్రి, 510; గ్రీన్ బ్లాక్, మై హోమ్ రెయిన్‌బో ఎపార్ట్‌మెంట్స్, టోలిచౌక్, హైదరాబాద్.



సంచార జాతుల ఉనికిపై ఉన్న మాయని మచ్చలని చెరిపేసి వారి కాళ్ళపై వారు నిలబడేలా చేయాలన్న తపన ఉన్నా, ప్రభుత్వ నిబంధనలనే సంకెళ్ళలోంచి బయట పడలేక ఏమీ చేయలేని రచయిత నిస్సహాయత, ఆవేదన పాఠకుల్ని చదివింపజేస్తాయి. ఈ గ్రంథ ద్వితీయానర్ధంలో గోండులు, కోలాములు, కోయలు, చెంచులు, అండమాన్ ఆదివాసులు మొదలైన గిరిజన జాతుల ఆచార వ్యవహారాలు వారి జీవన విధానంలో సంస్కృతుల్లో వస్తున్న మార్పులు విపులంగా చర్చించారు రచయిత. ఈ పుస్తకం ఇప్పుడెంతో అవసరం అంటూ మరో పీఠికను చిన వీరభద్రుడు రాశారు (వీరు గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు).

1986 నుంచి 1995 దాకా రాష్ట్రంలో గిరిజనాభివృద్ధిలో కొత్త ఆలోచనలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న కాలం 1987-1995 మధ్య కాలంలో రచయిత ఏటూరు నాగారంలోనూ, ఉట్నూరులోనూ, శ్రీశైలంలోనూ పని చేసిన అనుభవాలే ఈ వ్యాసాలు, రచన. 1789,1801 నుండి 2000 సంవత్సరాల దాకా పలు చట్టాలు గిరిజన ప్రాంత అభివృద్ధికి దోపిడి, తీవ్రవాదంపై కొమరం భీం-కొండపల్లి సీతారామయ్య, శంకరన్ వంటి నేతల కృషి రాశారు. ఆసక్తి కల్గించే రచన ఇది. గిరిజనుల అభ్యున్నతికి కృషి చేసిన "హేమండాల్ఫ్" గురించి మరింత రాస్తే బాగుండేది.

చదివించే కథలు

ఈ విలువైన పుస్తకాన్ని అజ్ఞ క్రియేషన్స్ సంస్థ ప్రచురించి తెలుగు కథా సాహిత్యానికి ఎంతో మహోపకారం చేసింది. ఇలాంటి బృహత్తర సాహితీ సంకలనాలు ప్రచురణల బాధ్యత ఏ అకాడమీలో విశ్వవిద్యాలయంలో సాంస్కృతిక శాఖో, అధికార భాషా సంఘమో, తెలుగు అకాడమీనో చేయాల్సిన పనులు. వారికి ప్రాంతీయ రాజకీయాలే సరిపోతాయి. ఇదో విశిష్ట కృషి అపూర్వ అక్షర సంపదను భద్రం చేశారు. ఎప్పుడో 1882 నాటి కథలు (తొలి కథగా ప్రమాణీకరించిన గురజాడ అప్పారావు 'దిద్దుబాటు'- 1910) అందునా "రాయలసీమ ప్రాంత మొదటి తరం కథలు (1882-1944) ఈ పుస్తకంలో సేకరించి, పరిశోధించి ప్రచురించారు. తమ పేరు లేకుండానే అత్యద్భుత కథలు రాసిన కథకుల కథలూ ప్రచురించారు. అలనాటి శారద, తెలుగు తల్లి, హిందూ సుందరి, చిత్ర గుప్త, శ్రీ సాధన, విజయ వాణి, సౌందర్య వల్లి, జన వినోదిని లాంటి ప్రసిద్ధ పత్రికల్లోని కథలు ఆ రచయితల పేర్లు పుస్తకాల చివర అనుబంధంగా ఓ చక్కటి వ్యాసం (1927-జనవరి 15 సాధన పత్రికల్లో ప్రచురణ అయిన "చిన్న కథలు" అనే కథా లక్షణ పరామర్శ) ప్రచురించారు. గురజాడ దిద్దుబాటు కథకు ముందే వచ్చిన 102 కథల్ని "వివిన మూర్తి" పట్టుకోగలిగారు. వీటిలో 92 కథలతో "దిద్దుబాటు" ప్రచురించారు. సింగమనేని నారాయణ, కేతు విశ్వనాథ రెడ్డి ఈ రాయలసీయ కథలు పుస్తకానికి ముందు మాటలు రాశారు. ఈ కథా సంకలనంలో కందాళ శేషాచార్యులు రాసిన 10 కథలు విద్వాన్ విశ్వంగారి 9 కథలు, ఆర్కుగం పిళ్ళై 3 కథలు, పేరులేని కథకుల కథలు 7, ఇతర పేర్లతో 2 కథలు, కె.సభా 1994 ఏప్రిల్‌లో 'చిత్రగుప్త' పత్రికలో "కడగండ్లు" కథ రాశారు. గుత్తి రామకృష్ణ "చిరంజీవి" కథ 1941లో రాశారు. వీరినే తొలి కథకులుగా భావించారు. కానీ 1926 జూన్ నెలలో "మత భేదం", "మీనాక్షి" కథల్ని అయ్యగారి నరసింహమూర్తి రాశారు. కథకుని పేరు లేకుండా 1918 లో "కడపటి పైసా" కథ సీమ తొలి కథ అన్నారు. "ఋతు చర్య" 1882 జనవినోదిని పత్రికలో కథే తొలి కథ అన్నారు. చాలా పెద్దకథ - సంభాషణల్తో ఉంది. గ్రాంథిక భాషలో సాగింది. తండ్రి వయసు వ్యక్తి తనను ప్రేమించడాన్ని, వేధించి వెంటబడటాన్ని తట్టుకోలేని అనాథ బాలిక లక్ష్మి ఆత్మహత్య చేసుకోవడం. సంగీత పాఠాలు చెప్పే శ్రీరాములు నాయుడులోని కాముకత తెలిపే కథాంశం "ప్రేమ బలి" కథకుడి పేరు లేదు. ఇది 1936 సాధన పత్రికలో ప్రచురణైన కథ. చాలా పెద్ద కథ. అలనాటి మధ్య తరగతి కుటుంబాల గాథ ఇది. ఒక చిన్న కథ కథకుడి పేరులేని ఈ కథ 1926 సాధన పత్రికలో అక్టోబరు ప్రచురించడమైనది. కథాంశం

మొదటి తరం రాయలసీమ కథలు, సంపాదకుడు: డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి పేజీలు: 240, వెల: రు. 200/-, ప్రతులకు: కె.మురళీ మోహన్, 9111-బ్లాక్ 9ఎ, జనప్రియ మహానగర్ మాల్‌పేట-హైదరాబాద్. సెల్: 9701371256



క్లుప్తంగా రామాపురం గ్రామ పురోహితుడు వెంకటరామ శాస్త్రులు అతని భార్య లక్ష్మీదేవమ్మ ఉంటారు. వారి కొడుకు బళ్ళారిలో ఇంగ్లీషు చదువు చెప్పించాలని బళ్ళారి వెళ్ళి అక్కడ వుంటారు. వారి కొడుకు కృష్ణుడు 2వ తరగతిలో చేరతాడు. 4 సంవత్సరాల తర్వాత ఓ రోజున లక్ష్మీదేవమ్మ అన్న కొడుకు నారాయణున్ని పిలుస్తారు పరీక్షిం చదలచి..అతని జవాబులు ఆ దంపతుల్ని సంతృప్తి పరచవు. ఇది కథ. "చిలకా గోరింక" కథ విద్వాన్ విశ్వం రాసినది. "స్వేచ్ఛ"ను దృష్టిలో పెట్టుకొని ప్రేమసారంతో రాసిన చిలకా గోరింక కథ, చిన్న పూలతోట...మేడలోని అమ్మాయి నిరంకుశత్వానికి ప్రతీకలా ఉంది. ఇలా అన్ని కథలు చదివింప జేస్తాయి. ఇది అభినందించదగ్గ ప్రయత్నం.

-ప్రసన్న కుమారి

కత్తిరించి అతికించండి

ఓ అల్లరి పిల్లాడు జిరాఫీ బొమ్మను కత్తిరించేశాడు. ఈ ముక్కలను జాగ్రత్తగా కత్తిరించి అతికించండి.



జత చేద్దాం

ఇక్కడ నలుగురు పిల్లలు, మూడు మంచాలు వున్నాయి. ఎవరి మంచం ఏదో జత చేసేయండి. ఇంతకీ మంచం లేకుండా మిగిలిపోయినదెవరో గుర్తించండి.

దారి కనుక్కోండి



సింగిల్ ఎవరు?

రంగులేద్దాం

ఆకాశంలో విమానం కనిపిస్తే చాలు. ఒక్కసారైనా అందులో ఎక్కాలనిపిస్తుంది ఎవరికైనా. అందులో మీలాంటి అల్లరి పిల్లలకు మరీను ప్రయాణం సంగతి తర్వాత. ముందు ఈ చిన్ని విమానానికి రంగులు వేయండి.



పదాలు వెతుకుదాం

ఇక్కడ 12 ప్రాణుల పేర్లు ఇంగ్లీషులో ఇచ్చాం. పైనున్న అక్షర సమూహంలో అవన్నీ వున్నాయి. అడ్డంగా, నిలువుగా, వంకరగా ఎలాగైనా వుండొచ్చు. వాటిని గుర్తించి సున్నా చుట్టండే.



ఎన్ని జంతువులున్నాయి

మీకు ఏనుగు అంటే చాలా ఇష్టం కదా. ఇక్కడ ఏనుగులో చాలా జంతువులు ఉన్నాయి. అవి ఎన్నో వాటి పేర్లేంటో చెప్పండి చూద్దాం.

జవాబు: మొత్తం- ఏనుగుతో సహా మొత్తం ఆరు. ఏనుగు, గుర్రం, చింపాంజీ, కుక్క, పిల్లి, ఎలుక.

చిట్టి నక్క

చేతుల్లో ఒదిగిపోయేంత చిట్టి నక్కల్ని మీరు చూశారా? పెద్ద పెద్ద చెవులతో కుందేళ్ల స్నేహితుల్లా కనిపించే ఈ బుజ్జి నక్కను ఫెన్నెక్ ఫాక్స్ అని పిలుస్తారు. ముద్దుచ్చేలా ఉండే ఇవి ఎడారి ప్రాంతంలో నివసిస్తాయి. ఇసుక తిన్నెల్లో తిరిగే ఇవి చాలా స్నేహంగా ఉంటాయి. వీటిని చాలా మంది పెంచుకుంటున్నారు. కానీ, ఓ ప్రాంతంలో మాత్రమే ఉండటంతో వాటి ఖరీదు చాలా ఎక్కువ. ఇవెన్ని ఉన్నాయో లెక్కలు తెలీవు. ఎందుకంటే ఎక్కువగా ఇసుక బొరియల్లో తలదాచుకుంటాయి. వాటి కుటుంబాలతో కనిపించే ఇవి ఒక దానితో ఒకటి ప్రేమగా ఉంటాయి.

- ఉత్తర ఆఫ్రికాలోని సహారా ఎడారి ప్రాంతం, దాని దగ్గరగా ఉన్న ఆసియా ప్రాంతంలో ఇవి ఎక్కువగా కనబడతాయి. మొరాకో, ఈజిప్ట్, సినాయ్ ద్వీపకల్పం, కువైట్‌లో వీటిని చూడొచ్చు.
- వాటి పొడవాటి చెవులు, వెంట్రుకలు శరీర ఉష్ణోగ్రతల్ని నియంత్రిస్తాయి. పగలు వేడి నుంచి, రాత్రి చలి నుంచి కాపాడతాయి.
- వాటి చెవులతో మరో లాభం కూడా ఉంది. ఇసుకలోని కీటకాల చప్పుడును గ్రహించేందుకు అవి అనువుగా ఉంటాయి. చాలా చిన్న శబ్దాల్ని కూడా ఇవి వినగలవు.
- పద్నాలుగేళ్ల పాటు ఇవి జీవిస్తాయి. వీటి ప్రధాన శత్రువు ఈగిల్ ఔల్. దీనితో పాటు గుంట నక్కలు, కారకల్స్, హైనాలు, గ్రే హౌండ్స్ రకానికి చెందిన కుక్కలు.
- వీటిని పట్టుకోవడం అంత తేలికేం కాదు. ఇవి చాలా చురుగ్గా కదులుతాయి. ఇసుక బొరియల్లోకి దూరి తప్పించుకుంటాయి.
- సుమారు 1200 చదరపు అడుగుల స్థలంలో ఇసుక దిబ్బల్లో, మొక్కల అడుగు భాగాన బొరియల్ని తొలుస్తాయి. వాటిలో కుటుంబాలతో అవి నివసిస్తాయి. ఆ బొరియలకు 15 వరకు వివిధ ద్వారాలుంటాయి.
- పది చొప్పున ఇవి వేరే కుటుంబాలతో కలిసి ఉమ్మడిగా జీవిస్తాయి.
- సుమారు కేజీన్నర బరువు తూగే ఇవి 9 నుంచి 16 అంగుళాల వరకు ఎత్తు పెరుగుతాయి. తమాషా ఏమంటే... వాటి చెవులే ఆరు అంగుళాలు ఉంటాయి.
- వాటి పాదాల కింద వెంట్రుకలు బాగా ఒత్తుగా పెరిగి చెప్పుల్లా ఇసుక వేడి నుంచి రక్షిస్తాయి.
- పెద్దవి కూడా చిన్న పిల్లల్లా ఆటలాడుతూ హాయిగా బతుకుతాయి.
- పిల్లి చేసే శబ్దాలను పోలి ఉంటాయి వీటి అరుపులు.
- ఇవి అన్ని రకాల ఆహారాన్ని తింటాయి. మొక్కలు, కీటకాలు, చిన్న చిన్న పక్షులు, జంతువుల్ని తింటాయి.
- నీళ్లు లేకుండా చాలా రోజుల వరకు బతకగలవు. వాటి శరీర వ్యవస్థ దానికి అలవాటు పడి ఉంటుంది.
- నాలుగు అడుగుల ముందుకు, 2 అడుగుల ఎత్తుకు అవి దూకగలవు.

- ఖర్జూర చెట్లు ఎక్కి ఎంచక్కా పండ్లను లాగించేస్తాయి.
- పుట్టినప్పుడు వీటి కళ్లు మూసుకునే వుంటాయి. చెవులు కూడా ముడుచుకొని వుంటాయి. ఆ తర్వాత కొద్ది కాలానికి క్రమంగా చెవులు విప్పారతాయి.
- ఇది అల్జీరియా దేశపు జాతీయ జంతువు. వారి ఫుట్‌బాల్ జట్టును వీటి పేరొచ్చేలా 'లెస్ ఫెన్నెస్' అని పిలుస్తారు.

జర్నలిస్టు శైలికి మార్గదర్శి

"వాడుక భాష రాసే భాష" పేరుతో ఉన్నం వెంకటేశ్వర్లు రాసిన పుస్తకం నేటి తరం జర్నలిస్టులకు మార్గదర్శకంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. తెలుగు జర్నలిస్టులు, ప్రత్యేకించి దిన పత్రికల్లో పనిచేసేవారు ప్రతినిత్యం ఎదుర్కొనే భాషా సంబంధమైన అనేక సమస్యలకు ఈ పుస్తకం చాలా వరకు పరిష్కారం చూపుతుంది. అచ్చుతప్పులు మొదలుకొని వ్యాకరణ దోషాలు, వాక్య నిర్మాణం, పద బంధాలు, రచనా శైలిని సోదాహరణంగా వివరించారు. రచనా శైలిని మెరుగుపరుచుకోవడానికి అవసరమైన అభ్యాసాలను (ఎక్సర్‌సైజ్‌లు) కూడా ఇచ్చారు. సహజంగా దోషాలు ఎక్కడ జరుగుతాయో, ఎలాంటి సందర్భాలలో జరుగుతాయో, వాటిని ఎలా దిద్దుకోవాలో చెప్పారు. పాఠకులు మరిచిపోకుండా ఉండటానికి ప్రతి పేజీలోనూ హైలైట్స్ ఇవ్వడమే కాకుండా, కార్టూన్లుతో కూడిన సెటైర్స్ (వ్యంగ చిత్రాలు) ఈ పుస్తకానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భాషా శాస్త్రంలో ఉద్దండులైన తాపీధర్మారావు, చేకూరి రామారావు, రంగనాయకమ్మ తదితర చేయి తిరిగిన రచయితలు వ్యావహారిక భాషలో రచనలపై ఏమన్నారో సందర్భానుసారంగా ప్రస్తావించారు. ఆ రీత్యా ఈ పుస్తకం జర్నలిస్టులు తమ శైలిని మెరుగుపరుచుకోడానికి తప్పకుండా ఉపయోగ పడుతుంది.

ఉన్నం వెంకటేశ్వర్లు ప్రజాశక్తి జర్నలిజం కాలేజి ప్రిన్సిపాల్‌గా, బోధకునిగా సుదీర్ఘ కాలం పనిచేశారు. అంతకన్నా ముందు సెంట్రల్ డెస్కులోనూ, మఫిషల్ విలేకరుల యంత్రాంగానికి ఇన్‌చార్జిగానూ పనిచేశారు. ఈ అనుభవంతోనే భాషా శాస్త్రాన్ని ఆచరణకు జోడించి పాఠాలు రూపొందించ గలిగారు. ఆ పాఠాలనే మరింత మెరుగుపరిచి పుస్తకంగా తెచ్చారు.జర్నలిస్టులు మాత్రమే కాకుండా ఔత్సాహిక రచయితలు, ఆందోళనాకారులు, సాధారణ విద్యార్థులు కూడా ఈ పుస్తకాన్ని వినియోగిం చుకోవచ్చు. వి.వి గా సుపరిచితమైన వెంకటేశ్వర్లు భౌతికంగా వికలాంగులైనా మానసికంగా సమర్థవంతుడు. విద్యార్థి దశ నుండి అభ్యుదయ రాజకీయాల్లో చురుకైన కార్యకర్తగా ఉన్న వివి ప్రజాశక్తిలో చేరిన తర్వాత కూడా ప్రజా ఉద్యమాలతో చురుకైన సంబంధాలను కొనసాగించారు. తాను నివసిస్తున్న ప్రాంతంలో ప్రత్యక్ష కార్యకలాపాల్లో పాల్గొని నిర్మాణ దక్షునిగా అందరి మన్ననలు పొందారు. ప్రజాశక్తి జర్నలిజం కాలేజీలో తయారైన అనేకమంది ప్రజాశక్తిని వీడి ఇతర పత్రికల్లో చేరినా తమ మూలాన్ని మరిచిపోకుండా తమ వృత్తి ప్రావీణ్యాన్ని మెరుగు పరుచుకుంటున్నారు. ఈ పుస్తకం చివరిలో అలాంటి వారి అభిప్రాయాలను కూడా పొందు పరిచారు.

భాషకూ, జర్నలిజం వృత్తికీ అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. భావ వ్యక్తీకరణ సాధనం భాష. ఒక భావాన్ని అందరూ ఆమోదిస్తే అది భౌతిక శక్తిగా మారుతుందని లెనిన్ అన్నాడు. భావాలు భౌతిక శక్తిగా మారాలంటే ఆ భావాలను మోసుకొచ్చే భాష అందరికీ అర్థం కావాలి. అందుకే అది వాడుక భాషలో ఉండాలి. అలాంటి భాష పదునుగా, సూటిగా, సరళంగా ఉండాలి. ఆకర్షణీయమైన శైలి ఉండాలి. అపార్థాలకూ, తప్పుడు భాష్యాలకూ అవకాశం ఉండకూడదు. మనసుకు నేరుగా హత్తుకోవాలి. చదివే కొద్దీ సాగి పోతుండాలి. సాగే కొద్దీ ఆలోచనలకు పదును పెట్టేదిగా ఉండాలి. అన్ని శాస్త్రాల్లాగానే భాష కూడా ఒక శాస్త్రం. దానికి ఒక రీతి, నియమం ఉంటుంది. వాటిపై పట్టు సాధిస్తే ఎవరైనా మంచి రచయితగా, జర్నలిస్టుగా రాణిస్తారు.

తెలుగులో భాషపై అనేక పుస్తకాలు ఇప్పటికే వచ్చాయి. జర్నలిజంపైనా పుస్తకాలున్నాయి. కాని జర్నలిస్టు రచనా శైలిని మెరుగుపరిచే భాషా సంబంధమైన పుస్తకాలు అరుదు. నైపుణ్యమున్న అనేక మంది సీనియర్ జర్నలిస్టులు మనకున్నారు. వ్యాకరణంపై పట్టున్న పండితులకు కొదవ లేదు. కాని వారి అనుభవం ఆధారంగా రాసిన పుస్తకాలు తక్కువ. ఆ లోటును ఈ పుస్తకం పూడుస్తుంది. భాష అనేది ఒక తర్కం కూడా. అందులో అక్షరాలు, పదాలు, వాక్యాలు మాత్రమే కాదు, వాటి మధ్య అంత:సంబంధం ఉంటుంది. వీటి మధ్య పొందిక ఎంత బిగువుగా ఉంటే దాని ద్వారా చెప్పదలుచుకున్న భావం అంత శక్తిమంతంగా పోతుంది. అర్థంకాని భావాలు అక్కడే ఆగిపోతాయి. విస్తరించవు. ఆ భావాలను మోసే భాషను మార్చుకుంటేనే తిరిగి అవి ప్రయాణిస్తాయి. ఈ క్రమంలో భాష నిరంతరం మారుతూ ఉంటుంది. అభివృద్ధి అవుతుంది. భాషాభివృదికీ సామాజిక, శాస్త్ర సాంకేతికాభివృదికీ సంబంధం ఉంది. ప్రతి జాతికీ ఒక భాష ఉంటుంది. ఏ జాతి శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందో ఆ జాతి భాష విస్తరిస్తుంది. తెలుగు భాష వికాసం చెందాలంటే మన జాతి శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి కావాలి. సామాజిక పురోగతి సాధించాలి. అలాంటి సామాజిక పురోగతికి తిరిగి భాష ఒక సాధనంగా తోడ్పడుతుంది. ఈ తార్కిక సంబంధాన్ని అర్థం



వాడుక భాష - రాసే భాష

వెల:50రూపాయలు,

ప్రతులకు:

కె. ఉషారాణి,
12-628/25,26, 6వ
క్రాస్ రోడ్ (సీసాల కంపెనీ)
వెనుక , సుందరయ్య నగర్,
తాడేపల్లి మున్సిపాలిటీ,
గుంటూరు జిల్లా.

చేసుకున్నవారు మంచి రచయితలుగా రాణించ గలుగుతారు. ఒకే భాషలో స్థానిక వైవిధ్యముంటుంది. వేర్వేరు యాస (యాక్సెంట్) లుంటాయి. దేనికదే ప్రత్యేమైంది. రచయిత చెప్పినట్లుగా తెలుగు ఎక్కువగా ఉర్దూ, ఆంగ్ల భాషలతో సంపర్కం చెందింది. అదే సమయంలో శ్రీకాకుళం, ఆదిలాబాద్, చిత్తూరు, అనంతపురం వంటి సరిహద్దు జిల్లాలలో మాట్లాడే భాషపై పక్క రాష్ట్రాల ప్రభావం ఉంటుంది. దానికి తోడు భాషపై అభివృద్ధి చెందిన ప్రాంతాల ప్రభావమూ ఉంటుంది. అది ప్రాంతీయ తత్వానికి దారితీస్తుంది. అలాగే ఆధిపత్య వర్గాల, తరగతుల ప్రభావమూ ఉంటుంది. అది సామాజిక వివక్షతలకు దారి తీస్తుంది. వీటిని కూడా జర్నలిస్టులు రాసేటప్పుడు గుర్తుంచుకోవాలి. భాషా దురభిమానానికి గురి కాకూడదు. పాఠకులను మెప్పించడమెలా అన్నదే వారి లక్ష్యం కావాలి. పత్రికారంగంలో ఇలాంటి అవరోధాలన్నింటినీ అధిగమించి అందరినీ మెప్పించే భాషలో రాయడం అంత తేలికేమీ కాదు.

నేటి ప్రపంచీకరణ యుగంలో భాష కూడా వేగంగా అనేక మార్పులు చేర్పులకు లోనవుతుంది. ఈ మార్పులను అర్థం చేసుకొని మాతృభాషను సామాజిక మార్పుకు ఒక సాధనంగా మార్చడం చాలా అవసరం. ఈ సామాజిక కర్తవ్యాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని రచయిత ఈ పుస్తకాన్ని రాశారనుకుంటున్నాను. 96 పేజీలున్న ఈపుస్తకం ధర కూడా ఎక్కువేం కాదు. అందరికీ అందుబాటులో ఉంది. రచయితగా, జర్నలిస్టుగా ఎదగాలనుకునే ఔత్సాహికులందరూ ఈ పుస్తకాన్ని తప్పకుండా చదవాలని కోరుతున్నాను. కేవలం ఈ పుస్తకాన్ని చదవడం ద్వారా మాత్రమే పట్టు సాధించలేం. ఇందులో ఇచ్చిన విధంగా అభ్యాసం చేయడం, ఇతర రచనలతో పోల్చుకొని చదవడం, పాఠకుల నుండి స్పందనలు తెలుసుకొని తదనుగుణంగా దిద్దుబాటు చేసుకోవడం ద్వారా అభివృద్ధి కావటానికి ఈ పుస్తకం దోహదపడుతుందని భావిస్తున్నాను.

-వి.శ్రీనివాసరావు

రెక్కలపై చిత్రాలు



సీతాకోక చిలుకల రెక్కలపై మోనాలిసాను తగిలించాడు క్రిస్టియమ్ రామోస్. ఊహించని వస్తువులపై, అసాధ్య మనుకునేలా సృజన చేస్తాడు ఈ మెక్సికన్ కళాకారుడు. పిల్లలు తినే రంగు బిళ్లలతో బైక్‌ను తయారు చేసి రిప్లీస్‌లోకెక్కిన ఈ ఆర్టిస్ట్ కన్ను సీతాకోక చిలుకలపై పడింది. అందమైన రంగులు, ఆకృతులతో వయ్యారాలు ఒలకబోసే వీటిని మరింత అందంగా ముస్తాబు చేసేందుకు పెయింట్ బ్రష్ పట్టాడు. అతి సున్నితంగా ఉండే వాటి రెక్కలపై అద్భుత చిత్రాలను వేసి అందర్నీ ఆశ్చర్య పరిచాడు. ఒక్కో రెక్కపై 56 గంటల పాటు పనిచేసిన రామోస్ పదుల రకాల సీతాకోక చిలుకలకు మరింత రంగు పూశాడు. 12 సెంటీ మీటర్లుండే రెక్కలపై లియోనార్డో డావిన్సీ కళాఖండాల్ని అచ్చు వేశాడు. చిన్నప్పటి నుంచి సీతాకోక చిలుకలంటే బాగా ఇష్టమని, ఇప్పటికి తన కల నెలవేరిందని సంతోషాన్ని పంచుతున్నాడు. ఓ భూతద్దం చిన్నచిన్న బ్రష్‌లతో కుస్తీపడి తను అనుకున్నది చేశాడు. ఎక్స్‌ప్రెషన్స్ చెదరకుండా వేసిన డావిన్సీ చిత్రం లేడీ విత్ యాన్ ఎర్మిన్ చూసి రామోస్‌ను పొగడ్తలతో ముంచేస్తున్నారంతా. ఇంతకు ముందు సాలీడు గూళ్ల పెయింటింగ్‌లూ అతడికి మంచి పేరు తీసుకువచ్చాయి. ఇప్పటి వరకు 15 అంతర్జాతీయ అవార్డులను అందుకున్న క్రిస్టియమ్ రామోస్ కళావస్తువుల్ని బ్రిటన్, అమెరికా, జపాన్ తదితర దేశాల్లో ప్రదర్శించారు. ●



రామోస్



జీవనరంగంలో పెనుమార్పు - సంపదలో అభివృద్ధి

జైన్ కంపెనీ వారి లక్ష్యం ఏమనగా :

1) పంటలలో అధిక దిగుబడులు సాధించి, రైతాంగపు ఆర్థిక పుష్టిని బలపరుచుట. తద్వారా ఊగిసలాడుచున్న వ్యవసాయరంగాన్ని స్థిరంగా నిలబెట్టి, ఒడుదుడుకులను తట్టుకొనునట్లు చేయుట.

2) ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయరంగానికి సరియగు దిశానిర్దేశములుచేసి, రైతాంగమును లాభాల బాటలో నిలదొక్కునట్లు చేయుచున్నాము.

3) రైతాంగమును కేవలము లాభనష్టాలులేని అల్పాదాయ పంటలవైపుకాక ఆర్థికంగా దోహదముచేసే వాణిజ్య పంటలవైపు మరలుటకు కృషిచేయుచున్నాము.

4) పంటలు పండించుటలో, పాతపద్ధతులనుకాక నవీనపద్ధతులతో పంట దిగుబడులు ఎక్కువగుటకు తద్వారా ఆర్థికంగా రైతాంగము బలపడునట్లు ప్రయత్నములు చేయుచున్నాము.

5) విత్తనములనుండి మొదలుపెట్టి వ్యవసాయ శాస్త్రీయత వరకు మరియు ఇతర వ్యవసాయ ఉపాధులవలన ఆర్థికబలాన్ని పెంపొందించే విషయములవైపు రైతుల దృష్టి మరల్చునట్లు చేసినాము.

6) సమతుల్యమైన వ్యవసాయ పరిస్థితులను పొందుటకు కావలసిన విషయములు అనగా ప్రకృతి నుండి లభించు వ్యవసాయ వనరులను రైతాంగము పొందునట్లు చేయుట.

7) తరతరాలనుండి వ్యవసాయరంగంలోగల పాతపద్ధతులను నవీన విజ్ఞానముతో సమ్మిళితముచేసి, భావితరాలకు వ్యవసాయరంగంలో బంగారు బాటలను ఏర్పరచగలమని మాయొక్క (జైన్) దృఢమైన విశ్వాసము.

జైన్ ®
జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

జలగాం అడ్రస్ :
జైన్ ప్లాస్టిక్ పార్క్ పి.ఒ. బాక్స్ 72, యన్.హెచ్. నెం. 6, జలగాం - 425 001.
ఫోన్ : 257-2258011, ఫ్యాక్స్ : 257-2258111. E-mail : jisl@jains.com

హైదరాబాద్ అడ్రస్ :
1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, కెనరా బ్యాంక్ దగ్గర, గాంధీనగర్, హైదరాబాద్-500 080
ఫోన్ : 040-2761 4474, 9440797846, E-mail : jainhyderabad@jains.com, Website : www.jains.com

• AIR HOSTESS • AIRPORT OPERATIONS
• TICKETING & RESERVATIONS • FRONT OFFICE AND GUEST RELATIONS • HR & PUBLIC RELATIONS
• OPERATIONS MANAGER • TRAVEL AGENTS

AVIATION ▪ HOSPITALITY ▪ TOURISM

WE MAKE YOU FLY!

FLYING Cats

www.flyingcatsvizag.com

47-11-15, First Floor, Rednam Estates,
Dwarakanagar First Lane,
Visakhapatnam - 530 016.
E-mail : info@flyingcatsvizag.com

TEL : 0891-667 2345, 668 2345

3yrs BBA Degree
in Aviation, Hospitality & Tourism
Eligibility : 10+2 Age 17+

PLACEMENT 100% PLACEMENT ASSISTANCE ASSISTANCE

1yr Certificate Courses
in Aviation, Hospitality & Tourism
Eligibility : 10+2 or Degree (Pass/Fail) Age 17+

> Communication Skills > Grooming Workshops
> Projects & Internship > Personality Development

SEPARATE HOSTELS FOR BOYS & GIRLS

ADMISSIONS OPEN

CALL/SMS : **964 223 2345**